మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 09 సోమవారం సెప్టెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 358

Navabhoomi daily fallows..




## మంకీపాక్స్ కలకలం

- విదేశీయునికి మంకీపాక్స్ వ్యాధి లక్షణాలు
- వ్యాధి తీవ్రతగా ఉన్న దేశం నుంచి వచ్చిన యువకుడు
- ఎంపాక్స్ లక్షణాలుండటంతో ఐసోలేషన్‌కు తరలింపు
- ఆఫ్రికా దేశాల్లో ప్రబలుతున్న మంకీపాక్స్

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** పలు దేశాలను వణికిస్తున్న ప్రాణాంతక మంకీపాక్స్ భారతదేశంలోకి ఎంట్రీ ఇచ్చింది. మనదేశంలో తాజాగా తొలి ఎంపాక్స్ కేసు నమోదైంది. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న దేశం నుంచి వచ్చిన ఓ యువకుడిలో ఎంపాక్స్ లక్షణాలు గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. వెంటనే అతడ్ని ఐసోలేషన్‌లో ఉంచామని, ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపింది. రోగి నుంచి నమూనా సేకరించి ఎంపాక్స్ నిర్ధరణ కోసం పంపించామని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. నిబంధనలకు

## నిర్మాణంలో ఉన్న ఇళ్లను మాత్రమే కూల్చివేత

- నిర్మించిన భవనాలను కూల్చడం లేదు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన ప్రకటన
- మాదాపూర్,మల్లంపేట్ ఎఫ్టీఎల్,బఫర్‌జోన్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన విల్లాల కూల్చివేత
- అమీన్‌పూర్‌లోని అక్రమ నిర్మాణాలను కూల్చేసిన హైడ్రా

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై హైడ్రా దూకుడుగా ముందుకు సాగుతుంది. ఆదివారం రోజున ప్రధానంగా మూడు ప్రాంతాల్లో హైడ్రా కూల్చివేతల ప్రకియ చేపట్టింది.
మాదాపూర్‌లోని సున్నం చెరువు పరిధిలో ఆక్రమణలను.. మేడ్చల్ జిల్లా మల్లంపేట్ కత్వ చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన విల్లాలను.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని హెచ్ఎంటీ కాలనీ, వాణీనగర్‌లోని అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సాయంతో పోలీసుల బందోబస్తు మధ్య ఈ కూల్చివేతల ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అయితే హైడ్రా కూల్చివేతలపై.. ఆయా నిర్మాణాల యజమానులు ఆందోళనకు దిగుతున్నారు. ముందస్తు నోటీసులు లేకుండా కూల్చివేతలు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే హైడ్రా చర్యలపై పలువురు విమర్శలు చేస్తున్నారు.
ఈ క్రమంలోనే హైడ్రా కూల్చివేతలకు సంబంధించి ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు. ఎఫ్‌టీఎల్ / బఫర్ జోన్‌లోకి వచ్చే కొత్త నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తున్నామని ఏవీ రంగనాథ్ తెలిపారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఇప్పటికే నిర్మించిన ఇళ్లలో నివాసం ఉంటే వాటిని కూల్చివేయమని చెప్పారు. ఈ మేరకు ఒక ప్రకటన కూడా విడుదల చేశారు.
" ఎఫ్‌టిఎల్ / బఫర్‌లో నిర్మించబడి.. అందులో ఎవరైనా వ్యక్తులు నివాసం ఉంటే అలాంటి ఇళ్లను కూల్చివేయం. అలాంటివి ఆక్రమిత

## అర్హులకు ఇళ్లస్థలాలు

- నిజమైన జర్నలిస్టులకు ఎలాంటి నష్టం కలగకుండా చూసుకుంటాం
- పేట్ బషీరాబాద్‌లో 38 ఎకరాల భూమికి సంబంధించి స్వాధీన పత్రాలను సొసైటీకి అందజేసిన సీఎం
- ప్రజాభిప్రాయం, జర్నలిస్టుల సూచనలతో ప్రజా ప్రభుత్వం ముందుకు
- సమస్యలకు శాశ్వత పరిష్కారానికి మీడియా అకాడమీ కొత్త విధి విధానాల తయారు చేయాలని ఆదేశించిన సీఎం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
జర్నలిస్టులు సమాజానికి చికిత్స చేసే డాక్టర్లని, జర్నలిజం కూడా వ్యవస్థల్లో ఒక భాగమేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నిజమైన జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత మా ప్రభుత్వానిదని మాటిచ్చారు.
రవీంద్రభారతిలో జర్నలిస్ట్‌లకు భూమి పత్రాలను అందించే కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.
జర్నలిస్ట్‌ల సంక్షేమం కోరుతూ ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆనాడు వైఎస్ఆర్ నిర్ణయం తీసుకున్నారు. రవీంద్రభారతిలో జే.ఎన్. జే. హెచ్.ఎస్‌కు భూమి స్వాధీన పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి అందించారు. పేట్ బషీరాబాద్‌లో 38 ఎకరాల భూమికి సంబంధించి స్వాధీన పత్రాలను సొసైటీకి సీఎం అందజేశారు.
జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి ఎలాంటి శషబిషలు లేవు. మీ సమస్యకు మా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోంది. వృత్తిపరమైన గౌరవాన్ని ఎవరూ

### ఎవడుబడితే వాడు ఓ యూట్యూబ్ పెట్టుకుని వస్తున్నాడు

#### రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్-నవభూమిబ్యూరో
ప్రస్తుతం ఎవడుపడితే వాడు సొంత యూట్యూబ్ పెట్టుకుని జర్నలిస్టులమని చెప్పుకుంటూ ఏదిబడితే అది మాట్లాడుతున్నారని, మరి కొందరు 2లో

## నేనే కూల్చేస్తా

- జయభేరి సంస్థకు హైడ్రా నోటీసులపై స్పందించిన మురళీమోహన్
- నేనేమీ అక్రమాలకు పాల్పడలేదు...3అడుగులు రేకుల షెడ్ బఫర్‌జోన్‌లో ఉందని హైడ్రా నోటీసులు..
- స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు పరిశీలించారన్న సినీనటుడు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** జయభేరీ కన్‌స్ట్రక్షన్స్‌కు హైడ్రా నోటీసులు.. గత 24 గంటలుగా ఎటు చూసినా ఇదే చర్చ.. అంతకుమించి రచ్చ!. ఎన్ కన్వెన్షన్ తర్వాత జే కన్‌స్ట్రక్షన్ వంతు వచ్చేసింది..!
ముహూర్తం కూడా ఫిక్స్ అయ్యింది.. 15 రోజుల్లో నేల మట్టం అంటూ మీడియాలో, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై చిత్ర విచిత్రాలుగా కథనాలు వచ్చాయి కానీ.. 'వాళ్లకు వాళ్లుగా కూల్చితే సరే లేకుంటే మేమే కూల్చేస్తాం' అంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఎట్టకేలకు హైడ్రా ఇచ్చిన నోటీసులపై టాలీవుడ్ సీనియర్ నటుడు మురళీమోహన్ స్పందించారు. మూడు అడుగులే..మీడియాలో వస్తున్న వార్తలపై స్పందించిన మురళీమోహన్ తాను ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని క్లారిటీ ఇచ్చుకున్నారు. 'నేను ఆక్రమణలకు పాల్పడలేదు. 33 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నాను. ఏనాడూ ఎలాంటి

## సూక్ష్మ సాగునీటి సేద్యానికి ప్రోత్సాహం

- ఏపీలో రైతులకు చంద్రబాబు భారీ శుభవార్త..
- ఎస్సీ, ఎస్టీ రైతులకు ఐదెకరాల వరకు రూ.లక్ష రాయితీ
- 5 నుంచి 10 ఎకరాల వరకు 90 శాతం రాయితీ
- పదెకరాల పైబడినవారికి 50% రాయితీపై రూ.2 లక్షలు



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండుసార్లు, విభజిత ఏపీకి రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు నారా చంద్రబాబునాయుడు. గతంలో ఆయన కేవలం అభివృద్ధికే పెద్దపీట వేసేవారు. అయితే ప్రస్తుతం మాత్రం అభివృద్ధితోపాటు సంక్షేమానికి కూడా పెద్దపీట వేస్తున్నారు. రెండింటినీ సమాంతరంగా అమలు చేస్తానని ప్రకటించారు. దీనికి తగినట్లుగా జూన్ నాలుగోతేదీన కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం రైతులకు రూపాయి ఖర్చులేకుండా వంద శాతం రాయితీని ఇస్తోంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ సూక్ష్మ సాగునీటి పథకానికి పెద్దపీట వేస్తుంది. ఈసారికూడా ఆ దిశగానే పయనిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరాంతానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలో డ్రిప్ ఇరిగేషన్ సాగుకు 67,500 హెక్టార్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. 2015-16లో అప్పటి ప్రభుత్వ

## వాగులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- ఏపీలో తప్పిన పెను ప్రమాదం..
- 20 మంది సురక్షితం



**రాజవొమ్మంగి-నవభూమిప్రతినిధి:** ఏపీలో మరో బస్సు ప్రమాదం తప్పింది. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి (మం) బోర్నగూడెం వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. వంతెన పై నుంచి వాగులోకి దూసుకెళ్లింది.ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. అయితే.. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. వంతెన నుంచి దూసుకెళ్లిన బస్సు గాల్లో వేలాడుతూ ఉంది.అయితే.. ప్రమాదానికి గల కారణం.. వర్షమనే చెబుతున్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.ఈ క్రమంలో.. బస్సు అదుపుతప్పి దూసుకెళ్లిందంటున్నారు. రాజమండ్రి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు నర్సీపట్నం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## అల్లూరి జిల్లాకు వరద హెచ్చరిక

- సీఎం చంద్రబాబునాయుడు వెల్లడి
- కొల్లేరు ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలి
- కోలుకుంటున్న విజయవాడ ఇంకా నీటిలోనే..

2



**విజయవాడ-నవభూమిబ్యూరో:** అల్లూరి జిల్లాకు ఫ్లాష్ ఫ్లడ్స్ వస్తాయని హెచ్చరికలు ఉన్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల పరిశీలన అనంతరం విజయవాడ కలెక్టరేట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.
విశాఖలో కొండచరియలు విరిగిపడ్డాయి.. జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. కొల్లేరు పరిసర ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల్లో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు.
"విజయవాడలో ఎనిమిదో రోజు కూడా బాధితులు నీటిలోనే ఉన్నారు. వరద ప్రాంతాల్లో ఇంకా 0.51 టీఎంసీ నీళ్లు ఉన్నాయి. ఇవాళ కూడా

## వినాయక మండపాల జీవోను రద్దు చేసిన ప్రభుత్వం

- హోంమంత్రి అనిత వెల్లడి
- మండపాలకు డబ్బులు వసూలు చేసే జీవోను
- జగన్ ప్రభుత్వమే తీసుకువచ్చింది
- సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే రద్దు చేస్తున్నట్లు ప్రకటించారన్న అనిత

2



**విజయవాడ-నవభూమిబ్యూరో:** ఏపీలో వినాయక మండపాల ఏర్పాటుకు రుసుములు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై హోంమంత్రి అనిత క్లారిటీ ఇచ్చారు. వినాయక మండపాలకు ప్రభుత్వం ఎలాంటి చలాన్లు విధించట్లేదని హోం మంత్రిఅనిత స్పష్టం చేశారు. మండపాలకు డబ్బులు వసూలు చేసే జీవోను జగన్ ప్రభుత్వమే తీసుకువచ్చిందని చెప్పారు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయం రాగానే రూపాయి కూడా వసూలు చేయొద్దని చెప్పారని వెల్లడించారు. మరోవైపు పేటీఎం బ్యాచ్‌ను దింపి వైఎస్ జగన్ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో ఆదివారం మీడియా సమావేశంలో హోం మంత్రిఅనిత మాట్లాడుతూ..2022 లోనే గత ప్రభుత్వం గణేష్ మండపాలకు సంబంధించిన జీవో ఇచ్చింది. మేము ఆ జీవోలో ఉన్న దానిని చెప్పామంతే...గత ప్రభుత్వ జీవోలో ఉన్న అంశాలను సీఎం దృష్టికి కూడా తీసుకురావడం జరిగింది. ఎలాంటి డబ్బులు వసూలు చేయకూడదు అని సీఎం స్పష్టమైన ఆదేశాలు

## ప్రకాశం బ్యారేజ్‌ను ఢీకొట్టిన ఘటనలో కుట్రకోణం?

- బ్యారేజ్‌ను ఢీకొట్టిన బోట్లు వైసీపీ నేతలవే..
- బోట్లను నిర్వహిస్తున్న శేషాద్రి,కోమటి రామ్మోహన్
- కోమటి రామ్మోహన్ వైసీపీ నేత రఘురాం మేనల్లుడు
- వీటిని లీజుకు తీసుకున్నది మాజీ ఎంపీ నందిగం
- ఐదేళ్ల నుంచీ అనుమతుల్లేకుండా నిర్వహణ

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో వరదలు ఉప్పొంగిన విషయం తెలిసిందే. ఈ సమయంలో ప్రకాశం బ్యారేజ్ కౌంటర్ వెయిట్‌లను బోట్లు ఢీకొట్టిన ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగుతోంది. బోట్లు ఎవరివి? వాటిని ఎవరు నడుపుతున్నారు? అనే కోణంలో పోలీసులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. ఈ బోట్లు శేషాద్రి, కోమటి రామ్మోహన్ నిర్వహిస్తున్నారని, వీటిని వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ నడుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కోమటి రామ్మోహన్ వైసీపీ నేత తలశిల రఘురాం మేనల్లుడు అని ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ బోట్లను కావాలని వదిలారా? లేక ఎలా వచ్చాయి? అనే అంశంపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. జలవనరుల శాఖ ఇచ్చిన ఫిర్యాదుపై పూర్తి స్థాయి దర్యాప్తు జరుగుతోందని ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో హోమ్ మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. ప్రకాశం బ్యారేజీకి వెళ్లి బోట్లు ఢీ కొట్టడంతో కౌంటర్ వేయిట్లు విరిగిపోయిన ప్రాంతాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. కాగా ఈ కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. వైసీపీ నేతల కుట్ర ఉందంటూ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.
కాగా బ్యారేజ్‌ను ఢీకొట్టిన బోట్లకు 5

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2
హైదరాబాద్
సోమవారం
09, సెప్టెంబర్, 2024

# శ్రీశైలం ఘాట్ రోడ్డులో నెమళ్ల నృత్యం.. ఆ మయూరాల నర్తనకు పర్యాటకులు ఫిదా

**హైదరాబాద్-నవభూమి:** ఎవరైనా అమ్మాయి అందంగా నాట్యం చేస్తే.. అచ్చం నెమలిలా నాట్యం చేసినట్లుందని పొగుడుతాం. మరి అలాంటిది ఓ నెమలే ప్రకృతి ఒడిలో పురి విప్పి నాట్యం చేస్తే.. ఆ దృశ్యాన్ని వర్ణించడం సాధ్యమేనా? నిజం చెప్పాలంటే వర్ణించడం కష్టమే. ఎందుకంటే నెమలి నాట్యం చేయడం



చూస్తే.. ప్రకృతిలో ఇంతకు మించిన అందమైన దృశ్యం ఉంటుందా అని అనిపించక మానదు.ఇక విషయానికి వస్తే.. నల్లమల్ల అడవుల్లోని శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఇలాంటి దృశ్యమే కనిపించింది. పచ్చని ఆహ్లాదకర వాతావరణంలో అందమైన నెమళ్లు.. నడిరోడ్డుపై పురి విప్పి నాట్యం చేశాయి. నెమళ్ళ పురివిప్పి ఆడుతున్న దృశ్యాలు పర్యాటకులను ఎంతో ఆకర్షించాయి. ఆ రమణీయ దృశ్యాలను పర్యాటకులు తమ కెమెరాల్లో బంధించారు. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ వావ్ అంటున్నారు.



## 20న కలెక్టరేట్ల ముట్టడికి ఆర్.కృష్ణయ్య డిమాండ్



**హైదరాబాద్-నవభూమి:** కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో తక్షణమే కులగణన నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు.దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి, విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ లోకసభపక్ష నేతగా రాహుల్‌గాంధీ నిత్యం డిమాండ్ చేస్తున్నారని ఆర్.కృష్ణయ్య ఆ లేఖలో వివరించారు. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ ఊసే తీయడం లేదని, మాట్లాడటానికి ప్రయత్నిస్తుంటే అణచివేస్తుందని ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50 శాతం సీలింగ్ అని చెప్పి తప్పించుకునేందుకు వీలులేదని తేల్చిచెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో 20వ తేదీన అన్ని జిల్లా కలెక్టరేట్ల ముట్టడి నిర్వహించాలని పిలుపునిచ్చారు. అప్పటికీ స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## మహబూబాబాద్ జిల్లాలో మళ్లీ వర్షం.. భయం గుప్పిట్లో జనం



**మహబూబాబాద్: నవభూమి:** వారం క్రిత కురిసిన వర్షాలకు నరకయాతన అనుభవించిన మహబూబాబాద్ జిల్లా ప్రజలు ఇప్పటీ కోలుకోక పోగా, మళ్లీ వర్షం పడడంతో గజగజ వణుకుతున్నారు. జిల్లాలో వాన మళ్లీ దంచికొట్టింది. శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జిల్లాకేంద్రంతోపాటు బయ్యా రం, గార్ల, డోర్నకల్, నెల్లికుదురు, కేసముద్రం మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం కూడా చిరు జల్లులు పడ్డాయి. మహబూబాబాద్ పట్టణంలో 18.25సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అతి భారీ వర్షానికి జిల్లా కేంద్రంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారు.

నెల్లికుదురు మండలంలో రావిరాల, ఆలేరు, వావిలాల ప్రాంతాల్లో కాజ్‌వేలపై నుంచి వరద ఉప్పొంగడంతో మహబూబాబాద్ నుంచి నెల్లికుదురుకు రాకపోకలు నిలిచిపోయాయి. నెల్లికుదురు నుంచి నర్సింహులపేట, చిన్నగూడూరు నుంచి నర్సింహులపేటకు బంద్ అయ్యాయి. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీ, కురవి గేట్, అనంతారం రోడ్డులోని పలు కాలనీల్లో నీళ్లు చేరాయి. గత వారం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిలు తాతాలిక మరమ్మతు పనులు చేయకముందే మళ్లీ వర్షం భారీగా కురవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## మూడు రోజులు భారీ వర్షాలు.. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ!



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో వచ్చే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇవాళ హైదరాబాద్ సహా కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గంటలకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.మంగళవారం నాడు కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.బుధవారం నాడు కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లిలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. శుక్రవారం నాడుతెలంగాణకు మరోసారి భారీ వర్ష సూచన. హైదరాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, గద్వాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్

మంచిర్యాల, మెదక్, మల్కాజ్‌గిరి, నాగర్‌కర్నూలు, నల్గొండ, నారాయణపేట, నిర్మల్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వనపర్తి, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి, వికారాబాద్ జిల్లాలకు భారీ వరర్ష సూచన

## తెలంగాణ వెదర్ మ్యాన్ బాలాజీపై కేటీఆర్ ప్రశంసల వర్షం



**హైదరాబాద్-నవభూమి:** ట్విట్టర్‌లో వాతావరణ వార్తలు చూసేవారికి పరిచయం అక్కర్లేని పేరు తెలంగాణ వెదర్ మ్యాన్. ట్విట్టర్ (ఎక్స్)వేదికగా తెలంగాణ వెదర్ అప్‌డేట్స్ ఇస్తూ.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు తెలంగాణ వెదర్ మ్యాన్ బాలాజీ. సోషల్ మీడియాలో ఐఎండీతో పాటు ఎంతోమంది వెదర్ మ్యాన్‌లు ఉన్నా బాలాజీ చెప్పాడంటే.. ఆరోజు ఖచ్చింతంగా వర్షం పడాల్సిందే.

ఎప్పటికప్పుడు వెదర్ రిపోర్టు అందించి, అందర్నీ అలర్ట్ చేస్తున్న బాలాజీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇలాంటి వాతావరణ హెచ్చరికలతో అద్భుతంగా పని చేస్తున్న యువకుడు బాలాజీకి కేటీఆర్ అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు. మీ ఉదార సేవకు ధన్యవాదాలు, శుభాకాంక్షలు అని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన టీ బాలాజీ బీటెక్ చదువుతున్నాడు. ట్విట్టర్‌లో 'తెలంగాణ వెదర్‌మ్యాన్' పేరుతో ఖాతా తెరిచాడు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తనదైన శైలిలో ఉపయోగించుకుంటూ వర్షాకాలంలో తాజా వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు పోస్టు చేస్తుంటాడు.

# 15 రోజుల క్రితమే ఎంగేజ్‌మెంట్.. ఇంతలోనే బీఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



**హైదరాబాద్-నవభూమి:** గుజరాత్‌లోని గాంధీనగర్‌లో పెద్దపల్లి జిల్లాకు చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ బల్ల గంగా భవానీ(26) ఆత్మహత్య చేసుకుంది. డ్యూటీలో నుంచి మధ్యలోనే వెళ్లిపోయిన ఆమె.. తన క్వార్టర్స్‌లోనే ఉరేసుకుంది. 15 రోజుల క్రితమే నిశ్చితార్థం అయిన గంగాభవానీ బలవన్మరణానికి పాల్పడటంతో ఆమె కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.గంగా భవానీ ఈ నెల 7వ తేదీన హెడ్ క్వార్టర్స్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు సెంట్రల్ డ్యూటీ చేసి తన క్వార్టర్స్‌లోకి వెళ్లింది. రాత్రి 9 గంటలు అయినా గంగాభవానీ డ్యూటీకి రాకపోవడంతో అధికారులు ఆమె క్వార్టర్ దగ్గరకు వెళ్లారు. తలుపు గడియపెట్టి ఉండటంతో దంతివాడ పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి తలుపులను తొలగించారు. దీంతో కిటికీ ఇనుప గ్రిల్స్‌కు ఉరేసుకుని ఉండటం గమనించారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆదివారం సాయంత్రం గంగాభవానీ మృతదేహం ఎన్టీపీసీకి చేరుకోవడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా, గంగాభవానీకి ఇటీవలే వివాహం కుదిరింది. ఆగస్టు 22వ తేదీన ఎంగేజ్‌మెంట్ కూడా అయ్యింది. డిసెంబర్ 5వ తేదీన పెళ్లి నిశ్చయమైంది. నిశ్చితార్థం కోసం సెలవులకు వచ్చిన గంగాభవానీ ఈ నెల 1వ తేదీనే గుజరాత్‌కు వెళ్లి విధులకు హాజరైంది. ఇంతలోనే గంగాభవానీ ఇంతటి అఘాయిత్యానికి ఒడిగట్టడంతో ఆమె కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

# ముగ్గురు యువకుల లైంగిక దాడి.. గర్భం దాల్చిన బాలిక



**సిద్దిపేట జిల్లా -నవభూమి:** సిద్దిపేట జిల్లా దుబ్బాకలో దారుణం చోటు చేసుకుంది. ఓ మైనర్ బాలికపై ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత బాలిక గర్భం దాల్చడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో నిందితులపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో సిద్దిపేట ఏసీపీ మధు వెల్లడించారు.

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ఓ బాలిక తొమ్మిదో తరగతి చదువుతుంది. బాలికకు మాయమాటలు చెప్పి దుబ్బాక మండలానికి చెందిన ఒక యువకుడు, అక్బర్‌పేట-భూంపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులు దగ్గరయ్యారు. ఈ క్రమంలోనే మూడు నెలల కిందట బాలిక తల్లి ఇంట్లో లేని సమయంలో ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురైంది. దీంతో బాలికను ఆమె తల్లి సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించగా.. బాలిక గర్భవతి అని తేలింది. దీంతో బాలికను నిలదీయడంతో జరిగిన విషయాన్ని తల్లికి వెల్లడించింది.ముగ్గురు నిందితులపై బాలిక తల్లి దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురు యువకులపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ మధు తెలిపారు. బాలికలు, మహిళలకు మాయమాటలు చెప్పి అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నిర్మాణంలో ఉన్న ఇళ్లను మాత్రమే కూల్చివేత

**(1వపేజీ తరువాయి)**నివాసాలు అయినప్పటికీ కూల్చివేయడం జరగదు. ఎఫ్‌టీఎల్ / బఫర్ జోన్ పరిధిలోకి వచ్చే నిర్మాణ దశలో ఉన్నవాటిని కూల్చివేస్తున్నాం. మాదాపూర్‌లోని సున్నం చెరువు, దుండిగల్‌లోని మల్లంపేట్ చెరువులో ఈరోజు కూల్చివేసిన కట్టడాలు.. నిర్మాణ దశలో ఉన్నాయి. వీటిని ఎఫ్‌టీఎల్ / బఫర్ జోన్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారు. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన కొన్ని షెడ్లు /హోటల్స్‌ను వాణిజ్యపరంగా వినియగిస్తున్నారు.. వాటిని అధికారులు కూల్చివేశారు. సున్నం చెరువులోని ఆక్రమ నిర్మాణాలు గతంలో కూడా కూల్చివేయబడ్డా యి... కానీ మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నారు.. అందుకే నేడు కూల్చివేయబడ్డాయి. అయితే వ్యక్తులు నివాసం ఉన్న ఇళ్లు కూల్చివేయబడలేదు.

దుండిగల్ మల్లంపేట చెరువులో కూల్చిన 7 విల్లాలు ఇప్పటికీ నిర్మాణంలో ఉన్నాయి (అందులో ఎవరూ నివాసం లేరు).. అవి భవన నిర్మాణ అనుమతులు లేకుండా ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్నాయి. వాటిని స్థానికంగా లేడీ డాన్‌గా పిలిచే బిల్డర్ విజయలక్ష్మి నిర్మిస్తున్నారు.. ఆమెపై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆమెకు స్థానిక రాజకీయ నాయకులతో పరిచయాలు ఉన్నాయి.

అమీన్‌పూర్ వద్ద కూల్చివేసిన నిర్మాణాలలో.. ప్రధానంగా కాంపౌండ్ గోడలు, గదులు, షెడ్‌లు ఉన్నాయి.. ఇవి ఏపీలోని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చేత ఆక్రమించబడ్డాయి. బిల్డర్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులపై స్థానిక పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు, ఫిర్యాదులు నమోదయ్యాయి.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఇప్పటికే నిర్మించిన ఇళ్లలో నివాసం ఉంటే.. వాటిని కూల్చివేయబోమని హైదరాబాద్ ప్రజలందరికీ మేము భరోసా ఇవ్వాలనుకుంటున్నాము. ఏదైనా చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఇల్లు, ఫ్లాట్, భూమిని కొనుగోలు చేయవద్దని మేము ప్రజలను అభ్యర్థిస్తున్నాము. కొనుగోలుదారులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లకు సంబంధించి ఏదైనా సందేహం ఉంటే.. వారు HMDA lakes (వెబ్‌సైట్) తనిఖీ చేయవచ్చు లేదా అలాంటి సందేహాలను నివృత్తి చేసుకోవడానికి మమ్మల్ని సంప్రదించవచ్చు" అని రంగనాథ్ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎవడుబడితే వాడు ఓ యూట్యూబ్

**(1వపేజీ తరువాయి)**రాజకీయ పార్టీలకు కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. వారి వ్యవహారం నచ్చక ప్రజలు అడ్డ తిరిగితే మళ్లీ వారే జర్నలిస్టులపై దాడి అంటూ ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.? ప్రభుత్వ పరంగా, ప్రజా ప్రతినిధిగా మేము ఎదుర్కొంటున్న ఈ విధానానికి ఎక్కడో ఓ చోటు ఫుల్ స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆ ఉద్దేశం మాకు లేదు:** నిజమైన జర్నలిస్టులలో ఒక్కరిని కూడా అగౌరవ పరచాలనే ఆలోచన కానీ వారికి అక్రిడేషన్ కార్డు, ఆరోగ్య భద్రత కార్డు, ఇంటి పట్టాల విషయంలో నష్టం చేసే ఆలోచన కానీ ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం ఎదుర్కొంటున్న అనవసరమైన రాద్ధాంతాలను నియంత్రించాల్సిన బాధ్యత జర్నలిస్టులపైనే ఉందని దీనికి పరిష్కార మార్గాలు సూచించాలన్నారు. ప్రభుత్వం ఎవరిని జర్నలిస్టుగా గుర్తించాలి? జర్నలిస్టులు హద్దు దాటి వ్యవహహిస్తే ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, అక్రిడేషన్ కార్డులు, భద్రతా కార్డుల జారీ, పత్రికల వర్గీకరణ, కేంద్ర ప్రభుత్వ గైడ్ లైన్స్, ఎన్నికల సంఘం గైడ్ లైన్స్ అన్నింటిని క్రోడీకరించి కొత్త విధివిధానాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని వాటిపై ప్రభుత్వం చర్చించి కేబినెట్ ఆమోదంతో చట్టబద్ధత కల్పించే బాధ్యత నేను తీసుకుంటానన్నారు. గడిచిన పదేళ్లలో అనేక అంశాల్లో పాలసీలు లేవు.



ఇలాంటి పరిస్థితుల నుంచి ఒక్కోసమస్యను పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు.

**మీరు హద్దు దాటితే మేమెందుకు విలువలు పాటించాలి:** గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీకి జర్నలిస్టులను అనుమతించడంపై ఆంక్షలు ఉండేవన్నారు. నేను సీఎం అయ్యాక జర్నలిస్టులు అడగకముందే జర్నలిస్టులను అనుమతించాలని నేనే స్పీకర్ ను కోరారనని సీఎం చెప్పారు. సిద్ధాంతాన్ని ప్రచారం చేసుకునేందుకు పార్టీలు పత్రికలు పెట్టుకున్నాయి. సిద్ధాంతాలు రాసుకోవాల్సిన పత్రికలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రేవంత్ రెడ్డి కొంత మందికి నచ్చకపోవచ్చు. అది మీ వ్యక్తిగతం. కానీ సీఎం హోదాలో రేవంత్ రెడ్డి గౌరవించాల్సిన బాధ్యత సదరు పత్రికలకు, ఆ పత్రికల యాజమాన్యం ముసుగులో ఉన్న రాజకీయ నాయకులకు ఉండదా? అని ప్రశ్నించారు. వాళ్లు ఆ గౌరవం, విలువలు పాటించనప్పుడు ప్రభుత్వ పరంగా మేమేందుకు పాటించాలన్నారు. బాధ్యతను మరిచి అసభ్యంగా వ్యవహరించి, అసందర్భమైన అంశాలను ప్రస్తావిస్తే సహజంగానే రియాక్షన్ ఉంటుందని ఆ రియాక్షన్ ను జర్నలిస్టులందరూ ఆపాదించుకోవద్దన్నారు.

**అసలు కంటే కొసరు జర్నలిస్టులే ఎక్కువయ్యారు:** చిట్ చాట్ లో ఆఫ్ ది రికార్డు వ్యాఖ్యలను కూడా రాద్ధాంతం చేస్తున్నారు. ప్రజల సమస్యలు వెలికితీసే జర్నలిస్టులు ఓ వర్గం అయితే కేవలం రాజకీయ పార్టీ యజమానిని రక్షించడానికి, ఆ యజమానికి మొత్తం వ్యవస్థను అప్పజెప్పడానికి ప్రయత్నం చేస్తున్న జర్నలిస్టులు మరో కోవ అన్నారు. ఈ రెండింటిని విడదీయాలన్నారు. అనేక కార్యక్రమాల్లో గుర్తింపు కలిగిన జర్నలిస్టులకు స్థలం దొరకని పరిస్థితి ఏర్పడుతున్నది. అసలు జర్నలిస్టుల కంటే యూ ట్యూబ్ పేరుతో కొసరు జర్నలిస్టులు ఎక్కువైపోయారని సీఎం వ్యాఖ్యానించారు. అసెంబ్లీ, సెక్రటేరియట్, ప్రభుత్వ కార్యాలయంలోకి మిమ్మల్ని అనుమతించడానికి ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదు. సరైన గుర్తింపు కార్డు తీసుకుని రావాలన్నారు. సెక్రటేరియట్ కు ఎవరు రావాలి? ఎవరికి పాసులు ఇవ్వాలి? ఏ పత్రిక సర్క్యులేషన్ ను బట్టి ఎంత మందికి పాసులు ఇవ్వాలో విధివిధానాలు రూపొందించాలని మంత్రి పొంగులేటికి సూచిస్తున్నానన్నారు. ప్రెస్ అకాడమీకి స్పెషల్ ఫండ్ కింద రూ.10 కోట్లు కేటాయిస్తామన్నారు. అర్హులైన మిగతా జర్నలిస్టులందరికీ ఫ్యూచర్ సిటీలో స్థలాలు ఇస్తామన్నారు.

## అల్లూరి జిల్లాకు వరద హెచ్చరిక

**(1వపేజీ తరువాయి)**ఆహారం, తాగునీరు అందించాం. కూరగాయలు పంపిణీ చేశాం. వరద ప్రాంతాల్లో 260 ట్యాంకర్లు తిరుగుతున్నాయి. 1200 వాహనాల ద్వారా రేషన్ సరకులు సరఫరా చేస్తున్నాం. రోడ్లపై ఇసుక, మట్టి లేకుండా శుభ్రం చేస్తున్నాం. పాడైన ఆటోలు, బైక్‌లు, కార్లు బాగు చేయిస్తాం. గృహోపకరణాలకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. వాహనాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు బాగు చేయించడం మాకు పెద్ద సవాల్. చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా కృష్ణానదిలో ప్రవాహం వచ్చింది. వాతావరణంలో పెను మార్పులే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. బుడమేరులో కబ్జాల వల్ల లక్షల మంది ఇబ్బంది పడ్డారు. వరద సహాయక చర్యలపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేశారు" అని చంద్రబాబు వివరించారు.

## వినాయక మండపాల జీవోను రద్దు చేసిన ప్రభుత్వం

**(1వపేజీ తరువాయి)**ఇచ్చారు.కూటమి ప్రభుత్వం గణేష్ మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం అమల్లోకి తీసుకొచ్చేటప్పుడు, జగన్ సర్కార్ హయాంలో నిర్ణయించిన రుసుములన్నీ అధికారులు ఇచ్చిన నోట్ ప్రకారం ప్రకటించామన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయం వచ్చిన వెంటనే గత ప్రభుత్వం నిర్ణయించిన విధానం రద్దు చేశామన్నారు. ఏ ఒక్క అనుమతికి డబ్బులు తీసుకోకూడదని స్పష్టం చేశామన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు ఏ ఒక్క అనుమతికి రూపాయి కూడా చెల్లించనక్కర్లేదని తెలిపారు. సీఎం ఆదేశాలను మేము 10 రోజుల క్రితమే అధికారికంగా ప్రకటించాం అన్నారు. ఈ నేపథ్యంలో 'గణేష్ మండపాలకు సంబంధించి ఎక్కడ ఎలాంటి డబ్బులు వసూలు చేయడం లేదు. మైక్ పర్మిషన్‌కు కూడా డబ్బులు తీసుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి' అని తెలిపారు.

# మంకీపాక్స్ కలకలం

**(1వపేజీ తరువాయి)**అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని, ఇదే సమయంలో వ్యాధి సంక్రమణ మూలాలను గుర్తించేందుకు కాంట్రాక్ట్ ట్రేసింగ్ కొనసాగుతోందని తెలిపారు. ఈ వ్యాధి తీవ్రతపై జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం ముందస్తుగానే అంచనాలు వేసిందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇలాంటి కేసులు వెలుగుచూసిన సందర్భంలో వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు పూర్తి సంసిద్ధతతో ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. కాగా, ఎంపాక్స్ ఎక్కువగా ఆఫ్రికా దేశాల్లోనే వ్యాప్తి చెందుతోంది. ఈ దేశాల్లో ఎంపాక్స్ కారణంగా మరణాలు కూడా సంభవించాయి. ఇప్పటికే ఆఫ్రికా దేశాల్లో 18 వేల కేసులు నమోదు కాగా, 926 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎంపాక్స్ కొత్త రకం కేసులు ఇప్పటి వరకు 258 నమోదైనట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఆఫ్రికాలోని బురుండి, రువాండా, కెన్యా, ఉగాండాతోపాటు స్వీడన్, థాయ్‌లాండ్ దేశాల్లోనూ ఈ కేసులు వెలుగుచూశాయి. కాగా, ఎంపాక్స్ వ్యాప్తి నేపథ్యంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను అప్రమత్తం చేసింది.

## అర్హులకు ఇళ్లస్థలాలు

**(1వపేజీ తరువాయి)**పెంచరు.. అది మనకు మనమే పెంచుకోవాలి. ప్రజాభిప్రాయం, జర్నలిస్టుల సూచనలతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. వ్యవస్థలపై నమ్మకం పెంచాలన్నదే మా ప్రభుత్వ విధానం.. జర్నలిజం కూడా వ్యవస్థల్లో ఒక భాగమే.

'ఆనాడు రాజాకీయ పార్టీలు సిద్ధాంత భావజాల వ్యాప్తి కోసమే పత్రికలు ఏర్పాటు చేసుకునేవి. కానీ ఈరోజుల్లో ఉన్మాద ధోరణితో వ్యవహరించే పరిస్థితులు దాపురించాయి. కొందరు చేసే పనులతో జర్నలిస్టులందరికీ చెడ్డపేరు వస్తోంది. కొంతమంది జర్నలిస్టు పదం అర్థాన్నే మార్చేస్తున్నారు. అలాంటి వారిని నియంత్రించే బాధ్యత మీపైనే ఉంది. నిజమైన జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత మా ప్రభుత్వానిది.

భాష విషయంలోనూ కొన్ని పత్రికలు గీత దాటుతున్నాయి. ముఖ్యమంత్రి హోదానూ అవమానపరిచేలా వ్యవహరిస్తున్నారు. కేవలం రాజకీయ పార్టీల యజమానులను రక్షించేందుకే వారు ప్రాధాన్యతనిస్తున్నారు. అలాంటి వారిపై తీసుకునే చర్యలను నిజమైన జర్నలిస్టులు ఆపాదించుకోవద్దు. నిజమైన జర్నలిస్టులను కాపాడుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉంది. ఆరోగ్య భద్రత కార్డులు, అక్రిడేషన్ ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం మీడియా కాడమీ కొత్త విధి విధానాలు తయారు చేయాలని ఆదేశిస్తున్నా. వాటికి కేబినెట్ ఆమోదం తెలిపే బాధ్యత మేం తీసుకుంటాం.

తెలంగాణకు టూరిజం, ఎనర్జీ, స్పోర్ట్స్ పాలసీలు లేవు. గత పదేళ్లుగా తెలంగాణకు అసలు పాలసీలే లేవు. మేం మీలో ఒకరమే... మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత మాదే. మీడియా అకాడమీకి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నుంచి రూ.10కోట్లు ఇస్తున్నా.. ఇళ్ల స్థలాల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దు. అర్హులైన వారిని ఫ్యూచర్ సిటీలో భాగస్వాములను చేస్తాం. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో మనందరం భాగస్వాములమవుదాం' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## నేనే కూల్చేస్తా

**(1వపేజీ తరువాయి)**అవకతవకలకు పాల్పడలేదు. బఫర్ జోన్‌లో ఉంటే నేనే కూల్చేస్తాను. స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా ఆధికారులు వచ్చారు. బఫర్ జోన్‌లో మూడు అడుగుల మేరకు.. రేకుల షెడ్డు ఉన్నట్టు అధికారులు గుర్తించి నోటీసులు ఇచ్చారు. ఆ రేకుల షెడ్డును మేమే తొలగించేస్తాం.. హైడ్రా రానక్కర్లేదు. రెండ్రోజుల్లో (మంగళవారం లోపు) తాత్కాలిక షెడ్డును తొలగిస్తాం' అని మురళీ మోహన్ స్పష్టం చేశారు. దీంతో కొన్ని గంటలుగా మురళీ మోహన్‌పై వచ్చిన చిత్ర విచిత్రాలుగా వచ్చిన కథనాలు, విమర్శకులకు చెక్ పెట్టినట్లు అయ్యింది.

**తొలగిస్తే సరే..** హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చిన తర్వాత ఆ సంస్థ చీఫ్ ఏవీ రంగనాథ్ కూడా స్పందించారు. ' హైదరాబాద్‌లోని నానక్ రామ్‌గూడ రంగలాల్ చెరువులో నటుడు మురళీ మోహన్ జయభేరి కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశాం. ఫిర్యాదులు రావడంతో చెరువును పరిశీలించాం. ఆక్రమణ జరిగినట్లుగానే మా పరిశీలనలో తేలింది. వారంలో రోజుల్లో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలను తొలిగించేందుకు జయభేరి సంస్థ గడువు కోరారు. ఆక్రమణలు తొలగించకపోతే హైడ్రా కూల్చివేస్తుంది' అని రంగనాథ్ హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. సండే అయినా సరే కూల్చుడే అంటూ హైడ్రా నాన్ స్టాప్‌గా, దూకుడు మీద కూల్చివేతలు షురూ చేసింది. ఇవాళ ఒక్కరోజే భారీగా కూల్చివేతలు జరిగాయి. మాదాపూర్, మేడ్చల్ జిల్లా మల్లంపేట్, సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు వద్ద.. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చేస్తోంది. ఇక మాదాపూర్ సున్నం చెరువులో కూడా హైడ్రా కొరడా ఝులిపించింది. సున్నం చెరువు మొత్తం విస్తీర్ణం 26 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న షెడ్డులను భారీ బందోబస్తు మధ్య హైడ్రా కూల్చేసింది.

## సూక్ష్మ సాగునీటి సేద్యానికి ప్రోత్సాహం

**(1వపేజీ తరువాయి)**హయాంలో అమలు చేసిన పాత నిబంధనలనే అమలు చేయనున్నారు. అవే రాయితీలను కొనసాగించనున్నారు. రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**79,105 హెక్టార్లలో పరికరాలు కావాలని కోరిన రైతులు**

అనంతపురం జిల్లాలో 37,500 హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 30వేల హెక్టార్లలో సూక్ష్మ సాగునీటి సేద్యాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు అవసరమైన పరికరాలను అప్పగించే బాధ్యతను 26 కంపెనీలకు అప్పజెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. 79,105 హెక్టార్లలో పంట సాగుచేసేందుకు పరికరాలు కావాలని రైతులు కోరుతున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఐదెకరాల వరకు రూ.లక్ష రాయితీ, ఐదు నుంచి 10 ఎకరాల వరకు 90 శాతం రాయితీ, పది ఎకరాల పైబడినవారికి 50 శాతం రాయితీపై రూ.2 లక్షల చొప్పున ఇస్తారు. సేద్యానికి సంబంధించిన పరికరాలకు సంబంధించి ఐదెకరాల్లోపు 55 శాతం, 12.50 ఎకరాల్లోపు 45 శాతం రాయితీని ప్రభుత్వం అన్నదాతలకు అందజేస్తోంది. త్వరలోనే పరికరాలను అందించనున్నారు.

## ప్రకాశం బ్యారేజ్‌ను ఢీకొట్టిన ఘటనలో కుట్రకోణం?

**(1వపేజీ తరువాయి)**సంవత్సరాల నుంచి ఎలాంటి అనుమతులు లేవని తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వీటిని నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. వైసీపీ పెద్దల హస్తంతో ఇష్టానుసారంగా ఐదేళ్లుగా ఇసుక తవ్వకాలు చేపట్టిన విషయం తెలిసిందే. 2019 లో జరిగిన పడవ ప్రమాదానికి సంబంధించి కూడా ఎటువంటి విచారణ జరగలేదు. అప్పటి బోటు ప్రమాదంపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



# ట్రైన్ కప్లింగ్ బ్రేక్.. రెండుగా విడిపోయిన మగద్ ఎక్స్‌ప్రెస్

**న్యూఢిల్లీ– నవభూమి:** ట్రైన్ కంపార్ట్‌మెంట్స్ మధ్య కప్లింగ్ బ్రేక్ అయ్యింది. దీంతో ఆ రైలు రెండుగా విడిపోయింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు భయాందోళన చెందారు. బీహార్‌లోని బక్సర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. న్యూఢిల్లీ నుంచి ఇస్లాంపూర్‌కు వెళ్తున్న మగద్ ఎక్స్‌ప్రెస్‌కు కప్లింగ్ తెగిపోయింది. దీంతో ట్వినిగంజ్, రఘునాథ్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య ఆ రైలు రెండుగా విడిపోయింది. ఆదివారం ఉదయం 11.08 గంటల సమయంలో ఈ సంఘటన జరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదని చెప్పారు. 'రైలు ట్విినిగంజ్ స్టేషన్ దాటినప్పుడు ఈ



సంఘటన జరిగింది. రైలు ఇంజన్ నుంచి 13, 14వ కంపార్ట్‌మెంట్స్ అయిన ఎస్–7, ఎస్–6 కోచ్‌ల మధ్య కప్లింగ్ బ్రేక్ అయ్యింది. ఆ రైలు రెండుగా విడిపోయింది' అని ఈస్ట్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సీపీఆర్‌వో) సరస్వతి చంద్ర వెల్లడించారు.కాగా, రెస్క్యూ టీమ్, సాంకేతిక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయని రైల్వే అధికారులు తెలిపారు. సమస్యను సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రైలు కప్లింగ్ బ్రేక్‌పై దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ సంఘటన వల్ల డౌన్‌లైన్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు వివరించారు.

## వాట్సాప్ గ్రూప్‌లో గణేష్ ఫెస్టివల్ పోస్ట్ డిలీట్.. స్కూల్ ప్రిన్సిపాల్ అరెస్ట్



**జైపూర్– నవభూమి:** వినాయక చవితికి సంబంధించిన ఒక పోస్ట్‌ను వాట్సాప్ గ్రూప్ నుంచి స్కూల్ ప్రిన్సిపాల్ డిలీట్ చేశాడు. రెండోసారి కూడా అతడు అలా చేయడంతో టీచర్లు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్కూల్ వద్ద నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలో ముస్లిం అయిన ఆ స్కూల్ ప్రిన్సిపాల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌లోని కోటాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం కొందరు హిందూ టీచర్లు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రభుత్వ స్కూల్ కమిటీ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. అయితే మైనారిటీ వర్గానికి చెందిన స్కూల్ ప్రిన్సిపాల్ ముహమ్మద్ షఫీక్ తొలుత ఒక పోస్ట్‌ను డిలీట్ చేశాడు. రెండోసారి కూడా అతడు అలా చేయడంతో హిందువులైన కొందరు ఉపాధ్యాయులు, ఇతర సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు, హిందూ సంఘాలతో కలిసి ఆ స్కూల్ వద్ద బైఠాయించి నిరసనకు దిగారు.కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ స్కూల్ వద్దకు చేరుకున్నారు. హిందూ టీచర్లు, స్థానికుల ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. సామాజిక సామరస్యానికి విఘాతం కలిగించేందుకు ప్రయత్నించినందుకు స్కూల్ ప్రిన్సిపాల్ ముహమ్మద్ షఫీక్‌ను శుక్రవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో పోలీసులను మోహరించారు. గణేష్ ఫెస్టివల్ పోస్ట్‌లను వాట్సాప్ గ్రూప్ నుంచి పొరపాటున డిలీట్ చేసినట్లు మైనారిటీ స్కూల్ ప్రిన్సిపాల్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అయితే అతడు రెండోసారి కూడా అలా చేయడంపై ఫిర్యాదు అందడంతో అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

## బలవంతపు వసూళ్ల కోసం దుండగులు యత్నం.. క్లబ్ బయట కాల్పులు

**న్యూఢిల్లీ– నవభూమి:** క్లబ్ యజమాని నుంచి బలవంతంగా డబ్బులు



వసూలు చేసేందుకు కొందరు దుండగులు ప్రయత్నించా రు. క్లబ్ వద్దకు వచ్చిన సాయుధులు అక్కడున్న బౌన్సర్లను మోకాలుపై కూర్చొవాలని బెదిరించారు. ఆ తర్వాత క్లబ్‌లోకి వెళ్లారు. ఎవరూ లేకపోవడంతో ఆగ్రహంతో ఓనర్‌ను తిట్లారు. ఆ క్లబ్ బయట గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. గురువారం అర్ధరాత్రి వేళ ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో ఉన్న కాంచ్ క్లబ్ వద్దకు ముగ్గురు సాయుధులు వచ్చారు. గన్ తీసిన ఒక వ్యక్తి మహిళతో సహా ఇద్దరు బౌన్సర్లను మోకాలుపై కూర్చోవాలని బెదిరించాడు. పైకి లేస్తే వారి తలపై కాల్చివేస్తానని హెచ్చరించారు.కాగా, మరో ఇద్దరు వ్యక్తులు ఆ క్లబ్‌లోకి వెళ్లారు. యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేయాలని భావించారు. అయితే క్లబ్ లోపల ఎవరూ లేకపోవడంతో బయటకు వచ్చారు. ఓనర్‌ను తిడుతూ క్లబ్ వద్ద గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు.మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ క్లబ్ వద్దకు చేరుకున్నారు. అక్కడున్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. నిందితుల్లో ఒకరిని ఘజియాబాద్‌కు చెందిన షారుక్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. మిగతా నిందితుల కోసం వెతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## దేశంలో మంకీపాక్స్ తొలి కేసు?.. భయాందోళన వద్దన్న కేంద్రం

**న్యూఢిల్లీ– నవభూమి:** ప్రపంచాన్ని భయపెడుతున్న మంకీపాక్స్




(%వీజూశీఞ%) తొలి కేసు దేశంలో నమోదైనట్లు తెలుస్తున్నది. ఈ వైరస్ లక్షణాలున్న వ్యక్తికి ఎంపాక్స్ సోకినట్లు అనుమానిస్తున్నారు. ప్రత్యేక ఆసుపత్రిలోని ఐసోలేషన్‌లో అతడ్ని ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆ వ్యక్తి నుంచి సేకరించిన నమూనాలను పరీక్షకు పంపినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అయితే ప్రజలు ఎలాంటి భయాందోళన చెందవద్దని పేర్కొంది. ఎంపాక్స్ వైరస్‌తో పోరాడుతున్న దేశం నుంచి ఇటీవల భారత్‌కు తిరిగి వచ్చిన యువకుడ్ని అనుమానిత కేసుగా గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. ఆ రోగిని ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు చెప్పింది. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పేర్కొంది. ఆ వ్యక్తికి ఎంపాక్స్ సోకిందా లేదా అన్నది నిర్ధారించేందుకు అతడి నమూనాలను పరీక్ష కోసం పంపినట్లు వెల్లడించింది.కాగా, ఎంపాక్స్‌కు సంబంధించిన ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఈ కేసును డీల్ చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆ వ్యక్తిని కలిసిన వారిని గుర్తించేందుకు, అతడి నుంచి వైరస్ వ్యాప్తిని నిర్ధారించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) జారీ చేసిన ప్రమాద అంచనాలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మంకీపాక్స్‌ను ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉన్నట్లు వివరించింది.మరోవైపు తాజాగా ప్రపంచాన్ని వణికిస్తున్న ఎంపాక్స్ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా గత నెలలో ప్రకటించింది. 2022 జనవరి నుంచి 2024 ఆగస్ట్ వరకు 120కుపైగా దేశాల్లో ఎంపాక్స్ వ్యాప్తి చెందినట్లు తెలిపింది. లక్షకుపైగా కేసులు నిర్ధారణ కాగా, 220కుపైగా మరణాలు నమోదైనట్లు పేర్కొంది.

# క్లౌడ్ బరస్ట్‌లో వాస్తవమెంత..? ప్రపంచం కొత్త పాఠం నేర్వాల్సిందేనా..?




**న్యూఢిల్లీ– నవభూమి:** రెండు తెలుగు రాష్ట్రాలను ఈసారి భారీ వర్షాలు ముంచెత్తాయి. క్లౌడ్ బరస్ట్ జరిగిందా అన్నట్లు విజయవాడ, ఖమ్మం జిల్లాలు పెద్ద ఎత్తున వరదల్లో చిక్కుకుపోయాయి. అటు ఖమ్మంలో వేలాది ఎకరాల అడవి సైతం కొట్టుకుపోయింది. వేల సంఖ్యలో చెట్లు నేలకొరిగాయి. ఇవన్నీ దేనికి సంకేతం..? నిజంగానే క్లౌడ్ బరస్ట్ జరిగిందా..? దాని వెనుక ఉన్న కారణాలేంటి..? అనేది ఇప్పుడు అందరిల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విజయవాడ, ఖమ్మం జిల్లాలో ఈ సారి నష్టాన్ని చవిచూశాయి. వందలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఇండ్లు నేలమట్టం అయ్యాయి. ఇంకా ఇళ్లన్నీ బురదలోనే ఉండిపోయాయి. వారం గడుస్తున్నప్పటికీ ఇంకా ప్రజలు భారీ వరదల నుంచి తేరుకోలేకపోతున్నారు. ఈ వర్షాలపై అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సైతం ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో ఎన్నో విపత్తులను చూశాం కానీ.. ఇంతటి వరదల విలయాన్ని చూడలేదని అభిప్రాయపడ్డారు. ఎప్పుడూ ఒక్క గుజరాత్‌లోనే వరద విలయం కనిపిస్తూ ఉంటుంది. కానీ.. ఈసారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ ఆ పరిస్థితి చూశాం. ఇంతటి భారీ వర్షాలకు గల కారణాలనూ ఆయన వెతికే పనిలో పడినట్లుగా సమాచారం. ఎల్‌నినో ప్రభావం వల్ల గతేడాది పెద్దగా వర్షాలు పడలేదు. ఈసారి మాత్రం రుతుపవనాలు రివర్స్ అటాక్ చేశారు. భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు పడుతున్నాయి. అయితే.. ఈ వర్షం దేశవ్యాప్తంగా పడితే అంతగా చర్చకు దారితీసే అవకాశం ఉండేది కాదు. కానీ.. ఒకటి రెండు చోట్ల మాత్రమే కురియడం ఆందోళన కలిగించే అంశం. ఆకాశానికి రంధ్రం పడిందా అన్నట్లుగా ఒకేచోట కుండపోత కురుస్తోంది. అటు గుజరాత్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోనూ ఈ క్లౌడ్ బరస్ట్‌లు కనిపించాయి. మరోవైపు.. కేరళలోని వయనాడ్‌లోనూ క్లౌడ్ బరస్ట్ ఏ స్థాయిలో ప్రభావం చూపిందో చూశాం. గతంలోనూ ఈ క్లౌడ్ బరస్ట్‌లపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన ఆరోపణలు ఉన్నాయి. వాటి వెనుక విదేశాల కుట్ర అనుమానం వ్యక్తం చేశారు. ఒకేచోట కుండపోతలా వర్షం కురియడం ఏంటని ప్రశ్నించారు. వేల కోట్ల నష్టం ఇవన్నీ ఇలా ఉంటే.. దుబాయి వంటి నగరాలు సైతం ఇప్పుడు వరదలతో మునిగిపోతున్నాయి. అక్కడ అసలే వర్షాలు పడవు అని ఇప్పటివరకు మనకు తెలిసిన అంశమే. దానిని పుస్తకాల్లోనూ చదువుకున్నాం. అలాంటి నగరంలోనూ వర్షాలు ముంచెత్తుతున్నాయి. చైనాలోనూ ఇప్పుడు యాగీ అనే ప్రాంతం వరదలతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. అటు బంగ్లాదేశ్‌లోనూ తుపాను బీభత్సం సృష్టించింది. ఇలా ప్రపంచంలో ఎక్కడ చూసినా ఈ క్లౌడ్ బరస్ట్ ప్రభావం కనిపిస్తూనే ఉంది. ప్రకృతి విపత్తులు కామన్ అయిపోయాయి. దీనిని బట్టి అర్థం చేసుకోవాల్సిన అంశం ఏంటంటే.. క్లౌడ్ బరస్ట్ కు ఆ ప్రాంతం.. ఈ ఏరియా అన్నట్లు కాకుండా ఎక్కడైనా.. ఎప్పుడైనా జరగొచ్చని నిపుణులు చెబుతున్నారు. భారత సంతతి యూట్యూబర్ రికార్డ్! ఇందుకు మారుతున్న వాతావరణ పరిస్థితులే అని పర్యావరణ నిపుణులు అంటున్నారు. మనుషులు తమ స్వార్థం కోసం పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారు. పెద్ద స్థాయిలో డ్యామేజీ చేస్తున్నారు. అందుకే.. ఇలాంటి క్లౌడ్ బరస్టులతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముందుముందు కూడా ఇలాంటి క్లౌడ్ బరస్టులు ఇంకా చూస్తామని సూచిస్తున్నారు. అయితే.. వీటి బారి నుంచి తప్పించుకోవాలంటే కొత్త కొత్త ప్రయోగాలు, ప్రయత్నాలు సాగాల్సిందేనని అంటున్నారు.

# 9/11 కంటే భారీగా 7/10 ప్లాన్... పాక్ యువకుడు అరెస్ట్!




**న్యూఢిల్లీ– నవభూమి:** 9/11 అటాక్ గా ప్రాచుర్యం పొందిన సెప్టెంబర్ 11 – 2001 దాడులు అగ్రరాజ్యం అమెరికాకు ఏ స్థాయిలో చేదు జ్ఞాపకాలను మిగిల్చాయనేది తెలిసిన విషయమే. ఆ రోజు ఆల్ ఖైదా అనే ఉగ్రవాద సంస్థ అమెరికా వాణిజ్య స్థానాలపై చేసిన దాడులో సుమారు మూడు వేలకు పైగా ప్రజలు మరణించారు. ఈ నేపథ్యంలో యూదులే లక్ష్యంగా ఈసారి ఇంతకు మించిన భారీ దాడికి ప్లాన్ జరిగినట్లు తెలుస్తోంది. అమెరికాలో నివసిస్తున్న యూదులపై ఉగ్రదాడికి ప్లాన్ చేశారని.. న్యూయార్క్ లో దాడికి పాల్పడేందుకు ప్లాన్ చేశాడని ఆరోపిస్తూ కెనడాలో పాకిస్థాన్ కి చెందిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు అమెరికా న్యాయశాఖ ఈ విషయాలు వెల్లడించింది. ఈ సందర్భంగా ఆ యువకుడి మేరు మహ్మద్ షాజేబ్ అలియాస్ షాజేబ్ జాదూన్ (20) అని తెలిపారు. యూఎస్ ఇతడిపై పలు అభియోగాల కింద అరెస్ట్ చేశారు. ఆయన హైదరాబాద్ ఈ నేపథ్యంలో ఈ విషయంపై స్పందించిన యూఎస్ అటార్నీ జనరల్ మెరిక్ గార్లాండ్... మహ్మద్ షాజేబ్ అక్టోబర్ 7 నాటికి న్యూయార్క్ నగరంలో ఇస్లామిక్ స్టేట్ పేరుతో ఉగ్రదాడికి ప్లాన్ చేశాడని ఆరోపించారు. ఈ దాడుల లక్ష్యం.. వీలైనంత ఎక్కువ మంది యూదులను చంపడమే అని ఆయన వెల్లడించారు. ఇజ్రాయేల్ – హమాస్ మధ్య జరిగిన యుద్ధానికి సంబంధించి ఈ దాడికి సిద్ధమవుతున్నారని చెబుతున్నారు. వాస్తవానికి గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయేల్ – హమాస్ మధ్య యుద్ధం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆ యుద్ధం మొదలై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈ పాక్ యువకుడు ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేశారని అంటున్నారు. ఈ మేరకు బ్రూక్లిన్ లోని యూదుల కేంద్రంలో మాస్ షూటింగ్ కు ప్లాన్ చేసినట్లు చెబుతున్నారు.

# మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస.. ఆరుగురు మృతి



**న్యూఢిల్లీ– నవభూమి:** ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. జిరిబామ్ జిల్లాలో ఆరుగురు మృతి చెందారు. శనివారం ఉదయం ఓ వ్యక్తిని నిద్రలోనే కాల్చి చంపారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. కాల్పులు కూడా చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో మరో ఐదుగురు సాయుధులు ప్రాణాలు కోల్పోయినట్లు మణిపూర్ పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు చూరాచాంద్‌పూర్‌లో మిలిటెంట్లకు చెందిన మూడు బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. బిష్ణుపూర్ జిల్లాలో రాకెట్ దాడులను ఇక్కడ్నుంచే చేపట్టినట్లు తెలుస్తోంది.రాకెట్ దాడుల్లో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. తొలి రాకెట్ దాడి తెల్లవారుజామున 4.30 గంటలకు ట్రోంగ్లావ్‌బిలో చోటు చేసుకుంది. ఈ దాడిలో రెండు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. రెండో దాడి మ. 3 గంటలకు మొయిరంగ్‌లోని మాజీ సీఎం మైరెంబమ్ కొయిరెంగ్ నివాస ఆవరణలో జరిగింది. రాకెట్‌కు అమర్చిన బాంబులు పేలడంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈ పరిణామాల నేపథ్యంలో చూరాచాంద్‌పూర్‌లోని మువాల్‌సంగ్, లైకా మువాల్సు గ్రామాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి మూడు బంకర్లను కూల్చేశారు పోలీసులు.

# ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనాలోచితంగా హామీలు.. దివాలా దిశగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు!




**న్యూఢిల్లీ– నవభూమి:** అధికారమే పరమావధి. దీని కోసం ఎన్ని హామీలైనా గుమ్మరించాలి. అర్హులు ఎవరు? ఎవరు కాదు? అనేది తర్వాత ముచ్చట. గ్యారెంటీలు అమలు చేయగలమా? లేదా? అనే చర్చ వద్దేవద్దు. ముందు ఓటర్లను ఆకర్షించాలి. ఉచిత పథకాలతో మురిపించాలి. అధికారంలోకి రావాలి.తీరా.. అధికారంలోకి వచ్చాక.. నిధుల కటకట మొదలవుతుంది. అనాలోచితంగా ప్రకటించిన హామీలతో రాష్ట్రాలకు రాష్ట్రాలే దివాలా తీసే దుస్థితి దాపురిస్తుంది. నిన్న హిమాచల్ ప్రదేశ్, ఇప్పుడు పంజాబ్, కర్ణాటకలో పరిస్థితులను చూస్తే ఇదే విషయం అర్థమవుతున్నది. ఆమ్ ఆద్మీ పార్టీ తీసుకొచ్చిన ఉచిత స్కీమ్‌లను ఫాలో అయిన కాంగ్రెస్ పార్టీ.. ఐదు గ్యారెంటీల పేరిట అడ్డగోలు హామీలిచ్చి కర్ణాటకలో అధికారంలోకి వచ్చింది.అయితే, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చే దారి లేక ఇప్పటికే పలు గ్యారెంటీల్లో కోతలు పెట్టింది. ప్రజలపై పన్నుల భారం మోపింది. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ. 25 వేల కోట్ల బకాయిలను కూడా చెల్లించట్లేదు. ఇక, ఎన్నికల ముందు 10 గ్యారెంటీలతో ఆశ పెట్టి హిమాచల్‌లో అధికారంలోకి వచ్చిన అదే కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు హామీలకు, సబ్సిడీలకు కత్తెర పెట్టే పనిని ప్రారంభించింది. తొలుత ఉచితాలతో మభ్యపెట్టిన పంజాబ్‌లోని ఆప్ సర్కారుకు కూడా ఈ సెగ తగిలింది. పర్యావసనంగా ఇప్పుడు ఆ రాష్ట్రమే దివాలా తీసే ప్రమాదం ఏర్పడింది. దీంతో సబ్సిడీల్లో కోత పెట్టడమే కాకుండా.. పన్నుల వాతకు ఆ సర్కారు శ్రీకారం చుట్టింది.

**పంజాబ్‌లో కోతలు.. వాతలు**

పెరుగుతున్న అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్ సర్కారు కోతల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. విద్యుత్తు సబ్సిడీలో కోత, పెట్రో పన్నుపై వాతతో ప్రజలపై భారాన్ని మోపేందుకు నిర్ణయించింది. పెట్రోల్‌పై 61 పైసలు, డీజిల్‌పై 92 పైసలు వ్యాట్‌ను విధించిన భగవంత్ మాన్ ప్రభుత్వం.. గృహ వినియోగదారులకు సబ్సిడీ విద్యుత్తు పథకాన్ని ఉపసంహరించుకొన్నది. 2024–25 ఆర్థిక సంవత్సరం చివరినాటికి పంజాబ్ అప్పులు రూ. 3.74 లక్షల కోట్లకు చేరుతాయని బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం వెల్లడించింది. అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి సబ్సిడీల్లో కోత, పన్నుల పెంపును ఓ మార్గంగా చూస్తున్నది.

**కర్ణాటకలో అలా.. తెలంగాణలో ఇలా**

ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో.. ఆరు గ్యారెంటీల ఆర్భాటంతో తెలంగాణలో గెలిచిన కాంగ్రెస్‌కు అసలు తత్వం ఇప్పుడు బోధపడుతున్నది. గ్యారెంటీల అమలు కర్ణాటకపై పెను ఆర్థిక భారాన్ని మోపింది. దీంతో ధరలు పెంచి, ఖజానా నింపేందుకు సిద్ధరామయ్య సర్కారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మరోవైపు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.25 వేల కోట్ల మేర బిల్లులను ఆలస్యం చేయడంతో అభివృద్ధి పనులకు ఎక్కడికక్కడ బ్రేకులు పడుతున్నాయి. ఇక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా హామీల అమలును మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకటి, రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని సర్కారు చెప్తున్నప్పటికీ లబ్ధిదారులు అందరికీ అందడం లేదన్నది బహిరంగ రహస్యమే.

**హిమాచల్ విలవిల**


2022 చివర్లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు హిమాచల్ కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10 గ్యారెంటీలు ప్రకటించింది. 18 ఏండ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, ప్రతి కుటుంబానికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, పాత పింఛన్ విధానం అమలు వంటి అనేక హామీలు ఇచ్చింది. అయితే, హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఈ హామీలను అమలు చేసే స్థితిలో లేదు. రాష్ట్రం మొత్తం అప్పులే రూ. 86,589 కోట్లకు చేరాయి. ఇదేమీ పట్టించుకోకుండా ఇబ్బడిముబ్బడిగా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన సుఖ్‌విందర్ సింగ్ సుఖు సర్కారు ఇప్పుడు హామీలకు, ఏకంగా 14 సబ్సిడీలకు కత్తెర పెట్టే పనిని ప్రారంభించింది.

## పట్టాలు తప్పిన జబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్.. క్షేమంగా బయటపడ్డ ప్రయాణికులు



**భోపాల్: నవభూమి:** మధ్యప్రదేశ్‌లోన్ జబల్‌పూర్‌లో పెను ప్రమాదం తప్పింది. ఇండోర్–జబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన రెండు బోగీలు పట్టాలు తప్పాయి. శనివారం ఉదయం జబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఇండోర్ నుంచి జబల్‌పూర్ వస్తున్నది. ఈ క్రమంలో జబల్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు తప్పింది. అయితే రైలు చాలా తక్కువగా ఉన్నదని, ప్లాట్‌ఫామ్‌పై ఆగుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నది అధికారులు వెల్లడించారు. ప్రయాణికులంతా క్షేమంగానే ఉన్నారని చెప్పారు.అయితే రైలు దిగడానికి సిద్ధమవుతుండగా ఒక్కసారిగా కుదుపులకు లోనవడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదం గురించి సమాచారం అందుకు రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పట్టాలు తప్పిన బోగీలను మళ్లీ ట్రాక్‌పైకి ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్నారు.రైలు జబల్‌పూర్ స్టేషన్‌కు చేరుకోబోతుండగా దాని రెండు కోచ్‌లు పట్టాలు తప్పాయని రైల్వే పీఆర్‌వో హర్షిత్ శ్రీవాత్సవ చెప్పారు. ఆ సమయంలో రైలు వేగం గంటకు 5 కిలోమీటర్లుగా ఉందన్నారు. అందువల్ల పెద్ద ప్రమాదం జరుగలేదని తెలిపారు. అయితే ప్రమాదం జరుగడానికి గల కారణాలను తెలుసుకుంటున్నామని చెప్పారు. కాగా, రైలు పట్టాలు తప్పడంతో ఆ మార్గం గుండా వెళ్లాల్సిన ఇతర రైళ్ల రాకపోకలు అంతరాయం ఏర్పడింది.

## పంతుళ్ల పల్లె.. ఆ గ్రామంలో ప్రతి ఇంట్లో ఓ ఉపాధ్యాయుడు



**బెంగళూరు– నవభూమి:** విద్య లేనివాడు వింత పశువు అన్నారు. అందుకేనేమో.. ఈ గ్రామంలో అందరూ విద్యావంతులే కాదు.. విద్య నేర్పేవారు ఇంటికొకరు ఉన్నారు. అందుకే ఈ గ్రామాన్ని 'పంతుళ్ల పల్లె' అని కూడా పిలుస్తుంటారు. ఇంచల్.. కర్ణాటకలోని బెళగావి జిల్లా సావదట్టి తాలూకాలోని ఓ గ్రామం. గ్రామ జనాభాలో పది శాతం అనగా 600 మంది ఉపాధ్యాయులు గ్రామంలోని దాదాపు ప్రతి కుటుంబంలో ఒకరు ఉపాధ్యాయ వృత్తిని తమ జీవనోపాధిగా ఎంచుకోవడం విశేషం. సిద్ధ సంస్థాన్‌కు చెందిన ఆధ్యాత్మిక గురువు డాక్టర్ శివానంద భారతి స్వామీజీ దూరదృష్టితో చేపట్టిన చర్యలే నేడు ఆ గ్రామంలో విద్యా కుసుమాలు పరిమళాలు వెదజల్లుతున్నాయి.

1970 దశకంలో ఆ గ్రామంలో ఒకే ఒక్క ప్రాథమిక పాఠశాల ఉండేది. ఇక్కడ ఉన్నత విద్యా సంస్థల ఆవశ్యకతను గుర్తించిన డాక్టర్ శివానంద భారతి మరికొందరు నిబద్ధతగల టీచర్లతో కలిసి ఓ విద్యా సొసైటీని స్థాపించారు. ఇక్కడ 1984లో గ్రామీణ ఉపాధ్యాయుల శిక్షణా కేంద్రం ఏర్పడింది. ఈ కేంద్రంలో ఇంచల్ గ్రామానికి చెందిన వారికి ఉచితంగా శిక్షణ, భోజనం సదుపాయం కల్పించారు. 1988 నుంచి సగటున ప్రతి ఏడాది ఇంచల్‌కు చెందిన 20 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందేవారు.దేశ సేవలోనూ ముందంజ

దేశ ప్రజలను విద్యావంతులను చేయడం ఎంత ముఖ్యమో.. దేశ రక్షణ కూడా అంతే ప్రాధాన్యం గలదని ఇంచల్‌వాసులు గుర్తించారు. దీంతో చాలామంది యువకులు దేశ సైన్యంలో చేరేందుకు సిద్ధపడ్డారు. ఇంచల్ గ్రామానికి చెందిన 300 మందికిపైగా యువకులు నేడు దేశ త్రివిధ దళాల్లో సేవలందిస్తున్నారు.

## తోడేళ్లతో బహరాయిచ్ గడగడ.. విద్యా సంస్థలు, మార్కెట్లు బంద్

**లక్నో– నవభూమి:** మానవ రక్తం రుచి మరిగి ప్రాణాంతకంగా మారిన తోడేళ్ల బెడదతో యూపీలోని బహరాయిచ్ జిల్లా గడగడలాడుతున్నది. తోడేళ్ల భయంతో పిల్లలు స్కూల్స్, కాలేజీలకు వెళ్లడం మానేశారు. మార్కెట్లు, దుకాణాలు బంద్ అయ్యాయి. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికే భయపడే దుస్థితి దాపురించింది. మాహ్సీ సబ్ డివిజన్‌లోని పలు గ్రామాలు భయంతో నిర్మానుష్యంగా మారిపోయాయి.

50 రోజులుగా భయం భయం

గడిచిన 50 రోజులుగా జిల్లా వాసులు కంటిమీద కునుకులేకుండా బతుకుతున్నారు. నరమాంస భక్షక తోడేళ్ల దాడిలో 35 మంది ప్రజలు గాయపడ్డారు. 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో అటవీ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా 'ఆపరేషన్ భేడియా' నిర్వహించి నాలుగు తోడేళ్లను పట్టుకున్నారు. ఇంకా మిగిలిన రెండు తోడేళ్ల కోసం ముమ్మరంగా గాలింపు కొనసాగుతున్నది.

## 9 కోట్ల రాయిని గుమ్మం ముందు మెట్టుగా వాడుకొంది

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచంలోనే ఇప్పటివరకు ఉన్న వాటిల్లో అతిపెద్దదైన అంబర్ శిలాజాన్ని రొమేనియాలో విచిత్రమైన పరిస్థితిలో గుర్తించారు. చెట్ల నుంచి వెలువడే ఒక రకమైన స్రావం గట్టిపడి, కొన్ని వేల సంవత్సరాల తర్వాత అంబర్ శిలాజంగా ఏర్పడుతుంది.దాదాపు 3.8 నుంచి 7 కోట్ల సంవత్సరాల క్రితం నాటి ఎర్రటి రాయి(అంబర్ శిలాజం) రొమేనియాలోని కోల్టి అనే



గ్రామానికి చెందిన ఓ బామ్మకు దొరికింది. సుమారుగా 3.5 కిలోలున్న ఈ రాయిని గుమ్మం ముందు మెట్టుగా ఆమె కొన్నేండ్లపాటు వాడింది. ఆమె ఇంట్లో చోరీకి వచ్చిన దొంగలు సైతం దాని ప్రత్యేకతను గుర్తించలేకపోయారు. చివరికి ఆ బామ్మ తరపు బంధువు ఒకరు దానిని గుర్తించారు. దాని విలువ రూ.9.2 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

శబ్దాలతో పురుషుల సంతానోత్పత్తిపై ప్రభావం

వాహనాలు చేసే పెద్ద శబ్దాలు పురుషుల సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని డెన్మార్క్ పరిశోధకులు చేసిన తాజా అధ్యయనంలో తేలింది. వాహన శబ్దాల కారణంగా 37 ఏండ్లు పైబడిన పురుషుల్లో వంధ్యత్వం పెరుగుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు.



## పదేండ్ల జన్‌ధన్‌తో ఏం ప్రయోజనం?

2024, ఆగస్టు 28 నాటికి ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకానికి పదేండ్లు పూర్తయ్యాయి. 2014 మే నెలలో తొలిసారి ప్రధానిగా పీఠమెక్కిన నరేంద్ర మోదీ తన ప్రతి నిర్ణయం ఒక సంచలనం కావాలనే జోరు మీదున్నారు. ఆ క్రమంలో 2014, ఆగస్టు 15 నాడు 'పీఎం జన్‌ధన్ యోజన' పథకాన్ని ప్రకటించారు. పైసా డిపాజిట్ లేకుండా దేశంలో ఉన్నవారందరికీ పొదుపు ఖాతాలు తెరవాలని బ్యాంకులను ఆదేశించారు. నిజానికిది 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన 'జీరో బ్యాలెన్స్' ఖాతాకు నకలు మాత్రమే. అవి కొనసాగుతూ 2014 వరకు లక్షలాది జీరో బ్యాలెన్స్ ఖాతాలు బ్యాంకు రికార్డుల్లోకి ఎక్కాయి. దానికి బీమా,ఓవర్‌డ్రాఫ్ట్ వంటివి జోడించి ప్రధాని మోదీ కొత్త పేరును పెట్టారు. ఉత్తర భారతంలో దీన్ని 'మోదీ ఖాతా'గా పిలుస్తుంటారు.

ప్రధాని మోదీ ఆదేశాల మేరకు 2014, ఆగస్టు 23 నుంచి 29 వరకు వారం రోజుల పాటు బ్యాంకులు ఆ ఖాతాల పనిలో పడ్డాయి. జనాలతో బ్యాంకులు కిక్కిరిసిపోవటంతో ప్రజల వద్దకే బ్యాంకు ఉద్యోగులు వెళ్లారు. తత్ఫలితంగా జనాలు ఊళ్లలోని కూడళ్లలోకి వచ్చి మరీ ఖాతాలు తెరిచారు. ఖాతాల్లేవని వెళ్లగొట్టే బ్యాంకువాళ్లు 'రండి! రండి!' అని రోడ్లపైకి రావడం అందరికీ వింతగా అనిపించింది. ఏదో ఒక గుర్తింపు కార్డు చూపిస్తే చాలు ఖాతా చేతికి వచ్చినట్టే. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తెచ్చి ఒక్కొక్కరి ఖాతాలో వేస్తామని అప్పటికే మోదీ ప్రకటించినందు వల్ల ఆ ఆశతో కోట్లాది మంది ఖాతాలను తెరిచారు. అప్పటికే అకౌంట్ ఉన్నవాళ్లు కూడా ప్రభుత్వ పథకాలకు విడిగా ఓ ఖాతా ఉండాలేమో అనుకొని 'జన్‌ధన్' ఖాతా కూడా తెరిచారు. 2014 ఆగస్టు చివరి వారంలో తెరిచిన జన్‌ధన్ ఖాతాల సంఖ్య కోటి 81 లక్షలు. అది ఓ గిన్నీస్ రికార్డు. ఈ దశాబ్ద కాలంలో ఆ యోజన ఫలితంగా 53 కోట్ల బ్యాంకు ఖాతాల్లో రూ.2.31 లక్షల కోట్లు జమయ్యాయని ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది.

ఈ ఖాతాదారులకు రూ.30 వేల జీవిత బీమా, రూ.2 లక్షల ప్రమాద బీమాతో పాటు రూ.10 వేలు ఓవర్‌డ్రాఫ్ట్ అప్పుగా లభించడం ఈ పథకంలోని ప్రత్యేకత. 6 నెలల కాలంలో ఖాతాలో కనీస నాలుగు లావాదేవీలుంటేనే ఓవర్‌డ్రాఫ్ట్‌కు అర్హత ఉంటుంది. అయితే, బ్యాంకులు ఇంటికి దూరంగా ఉండటంతో పని వదిలేసుకొని ఈ లావాదేవీలు నడిపినవారు తక్కువ. మామూలు సెల్‌ఫోన్‌కు సమాచారం అందించే వ్యవస్థ ఉన్నా అన్ని గ్రామాల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం లేనందువల్ల ఏ విషయం వారికి చేరకపోవడం మరో అడ్డంకి. దేశంలోని గ్రామాల్లో చిన్న నగదు లావాదేవీలు నడపడానికి వీలుగా ఆర్బీఐ బిజినెస్ కరస్పాండెంట్ వ్యవస్థకు అనుమతినిచ్చింది. దీని ఆధారంగా బ్రాంచీలకు దూరంగా ఉన్న గ్రామాల్లో ఆయా సర్వీస్ బ్యాంకుల ద్వారా 'బ్యాంకు మిత్ర'ల నియామకం జరిగింది. అయితే వారికి తక్కువ జీతంతో పాటు ఎలాంటి సర్వీస్ రూల్స్, క్రమశిక్షణ చర్యల విధానం లేకపోవడం వల్ల ఎవరూ నిలకడగా ఉండటం లేదు. పైగా, అక్షరజ్ఞానం లేని గ్రామీణులను కొందరు మోసం కూడా చేస్తున్నారు.

2017లో అవినీతికి పాల్పడ్డ బ్యాంకుమిత్రలు 20 శాతం ఉండగా ఏటా వారి సంఖ్య పెరుగుతున్నదని పలు నివేదికలు చెప్తున్నాయి. బ్రాంచీల విస్తరణ లేదా బ్యాంకు సిబ్బందే వారానికి ఒక రోజు గ్రామాల్లోకి వెళ్లడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. హంగామాగా ఆరంభించిన జన్‌ధన్ యోజన ప్రయోజనాల గురించి ప్రజల్లోకి సరిగా వెళ్లలేదనే చెప్పాలి. ప్రభుత్వం దీని నిర్వహణకు ఒక పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటుచేయలేదు. డబ్బు అవసరం ఉన్నవారికి, సామాన్యులకు బ్యాంకు ఓవర్‌డ్రాఫ్ట్ ఎంతో ఉపయోగకరం. అయితే దీనిగురించి ఖాతాదారులకు తెలిపే ప్రయత్నం ప్రభుత్వం కాని, బ్యాంకులు కాని చేయడం లేదు. ఎలాంటి గ్యారెంటీ లేకుండా సామాన్యుడికి పది రూపాయలు ఇవ్వడానికి కూడా బ్యాంకులు ముందుకురావు. ఓవర్‌డ్రాఫ్ట్ ఇస్తే ఆ సొమ్ము తిరిగిరాదని బ్యాంకర్ల విశ్వాసం, అనుభవం. 2016, డిసెంబర్‌లో ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం 30 కోట్ల ఖాతాల్లో 45 లక్షల మందికి ఓవర్‌డ్రాఫ్ట్ అందింది. అంటే, అది 2 శాతం కూడా కాదు. ఖాతాలో లావాదేవీలు నడిపించి ఓవర్‌డ్రాఫ్ట్ అందేలా ప్రజలకు సాయపడే బాధ్యతను ప్రభుత్వం ఏదైనా గ్రామీణ శాఖకు కట్టబెట్టాలి. ఊర్లలో రికవరీ బృందాలను ఏర్పాటుచేసి మళ్లీ తిరిగి కట్టేలా చర్యలు తీసుకోవాలి. ఓవర్‌డ్రాఫ్ట్ రికవరీ సంతృప్తిగా ఉంటే ఆ సొమ్మును పెంచడానికి కూడా బ్యాంకులు ముందుకు రావచ్చు. ప్రైవేటు లోన్‌యాప్‌ల ద్వారా చిన్న మొత్తాలు తీసుకొని అధిక వడ్డీ, పెనాల్టీలు కట్టలేక ప్రాణం మీదికి తెచ్చుకొన్న వార్తలు ఎన్నో ఉన్నాయి. 2022లో జన్‌ధన్ యోజన ఖాతాల పరిస్థితిపై రాజస్థాన్ గ్రామాల్లో ఇన్‌స్పైరా జర్నల్స్ సేకరించిన వివరాల ప్రకారం ఒక శాతం మాత్రమే ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకున్నారు. ఖాతా తెరిచిన నాటినుంచి 47 శాతం మంది ఒక్క లావాదేవీ కూడా జరపలేదు. 37 శాతం మందికే రూపే కార్డులు అందాయి. వారిలో రూపే కార్డులను రెన్యూవల్ చేసుకున్నవారు తక్కువే. 59 శాతం మంది తగిన ఆదాయం లేక ఖాతాను నడపడం లేదు. 33 శాతం మందికి ఇదివరకే బ్యాంకు ఖాతాలున్నాయి. ప్రభుత్వం డబ్బులు వేస్తుందని ఈ ఖాతాను కూడా తెరిచామని వారంటున్నారు. కేవలం ఖాతాల సంఖ్య, అందులో జమైన సొమ్మును ప్రచారం చేసుకొని ఈ పథకం గొప్ప ఫలితాలను సాధించిందని ప్రభుత్వం చెప్పుకోవడం తగదని, జన్‌ధన్ యోజన లక్ష్యాలు, ప్రయోజనాలు ఖాతాదారులకు అందినప్పుడే అది నిజమైన విజయమని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ చెప్పడం గమనార్హం.

# తెలివైన సమర్ధుడు 'గోపీచంద్'



"మానవులు జీవనదుల లాగా ఉండాలి కానీ, చైతన్యంలేని చెట్లు, పర్వతాల లాగా ఉండకూడదు" మానవ జీవితం ఒక చైతన్య స్రవంతి. ఎన్నో మలుపులు తిరుగుంది. అలాగే మనం కూడా నిరంతర అన్వేషణలో ఉండాలి. అప్పుడే మనకు సత్యమంటే ఏమిటో తెలుస్తుంది. నిన్న మనం నమ్మింది ఈ రోజు సత్యం కాదని తెలిసిన వెంటనే దాన్నివదలి మళ్ళీ అన్వేషణ సాగించాలి. "

త్రిపురనేని గోపీచంద్

నేను ఒక సమర్థుడని అని ఎవరైనా చెప్పుకోగలరు. కానీ నేనొక అసమర్ధుడిని అని చెప్పుకోడానికి ఎంత ధైర్యం కావాలి ? అసమర్ధుడుగా ఎలా మారుతారు ? తనకి తాను మారాలని ఎవరికైనా ఉంటుందా ? లేక సమాజం అలా ముద్ర వేస్తుందా? లేదా లోకమే అలా తయారు చేస్తుందా? ఇవన్నీ తెలియాలంటే "అసమర్ధుని జీవయాత్ర " నవలని అర్థం చేసుకుంటూ చదవాల్సిందే! ఇది తెలుగులో వచ్చిన తొలి మనో వైజ్ఞానిక నవల. దీని రచయిత శ్రీ త్రిపురనేని గోపీచంద్ గారు. ఇందులో అప్పటి మన పల్లెటూళ్ళు, మానవ సంబంధాలు, అన్నీ తారసపడతాయి. ఆస్తి అంతస్తులు తమ వికృత రూపంలో మనకి సాక్షాత్కరిస్తాయి. జమీందారీ వ్యవస్థ ఎలా బీటలు వారుతుందో, మన సమాజంలో పెట్టుబడిదారీ బీజాలు ఎలా నాటుకుంటున్నాయో విశదపరిచాడు గోపీచంద్. ఈ నవలలోని సీతారామారావు ధీరోదాత్తుడూ, సకల గుణాభిరాముడూ కాదు. అంతర్ముఖుడు. గోరంతలు కొండంతలు చేస్తాడు. పరిసరాలని పట్టించుకోకుండా ఊహాలోకాల్లో తేలిపోతూ వుంటాడు. ఇతడు ఊహాశాలి. దీనికి దాఖలాలు నవల పొడుగూతా కనిపిస్తాయి. అన్నిటికంటే తిరుగులేని సాక్ష్యం అసమర్ధుని అంతిమయాత్రే. అది బీభత్సరసప్రధానం. మానవ మనుగడలోని కీలకాంశాలను రచయిత చాలా ఒడుపుగా మనకు విశదపరిచాడు రచయిత.

గోపీచంద్ సంపూర్ణ మానవతావాది. తెలుగు రచయిత. హేతువాది. మనో వైజ్ఞానిక సాహితీవేత్త. తెలుగు సినిమా దర్శకుడు. ఈ తరానికి ఈయన గురించి పెద్దగా తెలియక పోవచ్చు. కానీ పబ్లిక్ సర్వీస్ పరీక్షల్లో తెలుగు సబ్జెక్టు ను ఐచ్చికంగా తీసుకొని పరీక్ష వ్రాసిన వారికి తప్పకుండా తెలుస్తుంది. ఎందుకంటే. ఈ నవల సిలబస్ లో ఒక భాగం!!!

జననం:



గోపీచంద్ 1910 సెప్టెంబర్ 8 న కృష్ణా జిల్లా అంగలూరు గ్రామములో త్రిపురనేని రామస్వామి చౌదరి, పున్నాంబలకు జన్మించాడు. ఈయన తండ్రి కవిరాజు త్రిపురనేని రామస్వామి గారు హేతువాది సంఘసంస్కర్త. గోపీచంద్ చిన్నతనములోనే తల్లిని పోగొట్టుకున్నాడు. ఇంటి పనులతోపాటు, తండ్రి నాస్తికోద్యమమునకు సహాయము చేయటం లాంటి పనులతో అతని బాల్యం గడచిపోయింది. 1933లో బి.ఎ పట్టా పొంది ఆ తర్వాత మద్రాసులో న్యాయవిద్యలో డిగ్రీ పూర్తిచేశారు. కొంతకాలం పాటు న్యాయవాదిగా ప్రాక్టీసు పెట్టినా ఆ వృత్తిలో ఇమడలేకపోయారు. ఈ దశలో కమ్యూనిజం పట్ల ఆకర్షితుడయ్యాడు. కానీ అందులోని కొన్ని సిద్ధాంతాలు నచ్చలేదు. ఆ తర్వాత ఎం.ఎన్.రాయ్ మానవతావాదం ఆయన పై గొప్ప ప్రభావాన్ని చూపింది. ఈ కాలంలో ఆయన ఆంధ్రా రాడికల్ డెమొక్రటిక్ పార్టీ కార్యదర్శిగా పనిచేసాడు. 1953లో ఆంధ్రరాష్ట్ర సమాచార శాఖ డైరెక్టర్గా, 1956లో ఆంధ్ర ప్రదేశ్ సమాచార శాఖ సహాయ డైరెక్టర్ గా పనిచేసాడు. 1957-62 వరకు ఆకాశవాణిలో పనిచేసాడు. వీరు రచించిన అనేక నాటకాలు, నాటికలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నాస్తికుడు:

హేతువాద నాస్తికత్వపు భావజాలాల వాతావరణంలో పెరిగిన గోపీచంద్ పై వాటి ప్రభావం సహజంగానే పడింది. 1928లో శంబుక వధ కథ ద్వారా సాహిత్యరంగంలోకి ప్రవేశించిన గోపీచంద్ 1938లో పట్టాభి గారి సోషలిజం అన్న పుస్తకాన్ని వెలువరించాడు. మొదట్లో కథా సాహిత్యంపై దృష్టి సారించిన ఆయన కొద్దికాలానికి నవలా రంగంవైపు కూడా మళ్ళారు. ఆయన రచనల్లో అసమర్ధుని జీవితయాత్ర, పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా మొదలైనవి పేరు గాంచాయి. 1963లో పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామాకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

**అనేక తత్వాలు:**

గోపీచంద్ తన జీవితంలో చాలా సంఘర్షణను అనుభవించాడు. అనేక వాదాలతో వివాదపడుతూ, తత్త్వాలతో దాగుడు మూతలాడుతూ, సంతృప్తిలోనూ అసంతృప్తిలోనూ ఆనందాన్నే అనుభవిస్తూ జీవయాత్ర కొనసాగించాడు. అతనిలోని అరుదైన, అపురూపమైన, నిత్యనూతనమైన అన్వేషణాశీలతకి ఆధారం. ఎందుకు? అన్నప్రశ్నే అతన్ని ఒక జిజ్ఞాసువుగా, తత్వవేత్తగా నిలబెట్టింది. అలా నేర్చుకోబట్టే స్వతంత్ర భావాలు గల ఒక గొప్ప రచయిత స్థాయికి ఎదిగాడు. 1928లోనే శంబుక వధ కథ ద్వారా సాహిత్యరంగంలోకి ప్రవేశించిన గోపీచంద్ 1938లో పట్టాభిగారి సోషలిజం అన్న పుస్తకాన్ని వెలువరించాడు. మార్క్సిజాన్నిఅధ్యనం చేసి 'బీదవాళ్ళాంతా ఒక్కటే' , గోడమీద మూడోవాడు , పిరికివాడు వంటి కథలు రాసారు. నూతన దృక్పధంతో షూమారు 300 కథలు రాసారు. ఆయన తొలి నవల పరివర్తనం. రెండవ నవల అసమర్ధుని జీవయాత్ర.

**మరణం:**

1939లో చలనచిత్ర రంగంలోకి ప్రవేశించిన గోపీచంద్ దర్శక నిర్మాతగా, రచయితగా పనిచేశాడు. చదువుకున్న అమ్మాయిలు, ధర్మదేవత, రైతుబిడ్డ మొదలైన చిత్రాలకు మాటలు రాశాడు. ప్రియురాలు, పేరంటాలు, లక్ష్మమ్మ మొదలైన చిత్రాలకు దర్శకత్వం వహించాడు. వాటివల్ల ఆర్థికంగా చాలా నష్టపోయారు. అరవిందుని భావాల పట్ల విశ్వాసం ఏర్పడడంతో ఆధ్యాత్మికవాదం వైపుకి మరలాడు. 1962 నవంబర్ 2 నాడు 52 సంవత్సరాల వయస్సులో బహుముఖ ప్రతిభాశాలి అయిన గోపీచంద్ గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు.

తండ్రి కొడుకులకు అరుదైన గౌరవం:

భారత ప్రభుత్వము 2011 సెప్టెంబరు 8న గోపీచంద్ శతజయంతి సందర్భమున తపాలా బిళ్ళ విడుదల చేసింది. అంతకుముందు 1987 వ సంవత్సరంలో జరిగిన కవిరాజు త్రిపురనేని శతజయంతి వేడుకలలో త్రిపురనేని రామస్వామి చౌదరి స్మారక తపాళా బిళ్ళను జారీ చేయడం జరిగింది. తెలుగు వారిలో తండ్రి, కొడుకులు ఇద్దరికి తపాల బిళ్ళలు విడుదల చేసిన అరుదైన గౌరవం వీరికి దక్కింది.

*జనక మోహన రావు దుంగ*
*ఫోన్: 8247045230*

## తెలుగు భాష గొప్పతనం



**తెలుగు అంటే ఒక వెలుగు**
**అమ్మ భాష తెలుగుభాష**
**కమ్మనైన భాష తెలుగు**
**అమ్మ నేర్పిన అమ్మ భాష**
**తెలుగు!!!**


**తీయనైన భాష తెలుగు భాష**
**అమ్మ ఒడిలోన పలికే తెలుగు భాష**
**తెలుగు భాష పాటల ఊట**
**సకల కళలకు పూదోట తెలుగు భాష!!!**

**నలుగురు మెచ్చే నా తెలుగు భాష**
**బహు చక్కనైన నా తెలుగు భాష**
**అందరినీ ఒక్కటి చేసే నా తెలుగు భాష**
**ఆత్మగండ్ల భాష నా తెలుగు!!!**

**స్వచ్ఛమైన తెలుగు భాష**
**అందమైన మన తెలుగు భాష**
**సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం తెలుగు భాష**
**అందమైన ప్రపంచంలో అందమైన భాష తెలుగు!!!**

**అమృతం లాంటి అమ్మ భాష తెలుగు**
**ఆనందాన్ని ఇచ్చే తెలుగు భాష**
**ఆత్మ బంధువు లాంటి భాష తెలుగు**
**వెన్నెల లాంటి వెలుగునిచ్చే తెలుగు భాష**
**అవని లో అమ్మ భాష గొప్పది!!!**

*రచన*
*దేవులపల్లి రమేశ్,*
*నంగునూర్, సిద్దిపేటజిల్లా*
*9963701294.*



# ఉపాధ్యాయ వృత్తి బహు ఉన్నతమైనది



ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం నాడు రాష్ట్ర రాజధానిలో గల రవీంద్ర భారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అతిరథ మహారథులు, అతిథులు, వక్తలు ప్రసంగించిన వేళ కొన్ని అంశాలు ఆలోచింపజేశాయి. తల్లిదండ్రుల కాళ్లకు దండం పెట్టానో లేదో తెలియదు కానీ నా గురువుల కాళ్లకు దండం పెట్టానని ఒకరు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది అదే రీతుల్లో చేయాలని ఒకరు. వ్యక్తి సమాజంలో ఉన్నత వ్యక్తిగా ఎదిగాడంటే దానికి కారణం ఉపాధ్యాయుడే నని, అలాగే వ్యక్తి సమాజానికి భారంగా మారాడంటే దానికీ కారణం ఉపాధ్యాయుడే అంటూ మాట్లాడారు. ఇవి నన్ను ఎంతగానో ఆలోచింపజేశాయి. అవును, వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు సత్యాలు! ఎందుకంటే, సకల వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తే విశేషమైన ప్రభావం కలది. సమాజంలో ఎవరైనా సరే అందరూ వారి వారి విద్యాభ్యాసాన్ని ఉపాధ్యాయుల వద్ద కొనసాగించిన వారే కదా! కేజీ నుండి పీజీ వరకు బోధించేవారంతా ఉపాధ్యాయులే! ఆయా స్థాయిల్లో, వేరు వేరు పేర్లతో పిలవబడినా, ప్రధమ కర్తవ్యం మాత్రం బోధించడమే కదా!

ఐక్యరాజ్యసమితి ప్రచురించిన మేర, ప్రపంచంలో అన్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తే ఘనమైనదనీ, ఆయా స్థాయిల్లో, ప్రాథమిక విద్య స్థాయి బోధన మరింత ఉన్నతమైనది, ఎందుకంటే విద్యా పునాదులు ఆ స్థాయిలోనే వేయబడుతుంటాయి. కావున అత్యంత జాగురుకతతో నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొంది. అవును, ప్రాథమిక విద్య దశల్లోనే విద్యా పునాదులు పటిష్టంగా మరియు స్పష్టంగా పడినప్పుడే మిగతా దశలు సవ్యంగా కొనసాగుతుంటాయి. ఏదైనా పెద్ద భవనం నిర్మించే ముందు పునాదులు లోతుగ, అతి గట్టిగా నిర్మిస్తేనే కదా సదరు బిల్డింగు పది కాలాలు నిలబడుతుంది. బోధన అనేది ఏ స్థాయిలో జరిగినా, విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలు, నైపుణ్యాలను గుర్తిస్తూ, వాటిని వెలికితేస్తూ, మెరుగుపరుస్తూ, వారి వారి ప్రవర్తనల్లో మార్పు తేవడమే విద్యా లక్ష్యం. మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తూ, ప్రకాశవంతంగా చేసినట్లుగా చిన్నారులను భావిపథ నిర్దేశకులుగా తీర్చిదిద్దే అరుదైన గురుతర బాధ్యత ఉపాధ్యాయులదే కదా! పూర్తిగా మట్టితో తయారైన కుండకు ఆయా డిజైన్లలో రంగులు వేయటం తేలికే, కానీ ఏ ఆకారం లేని బంక మట్టిని కోరుకునే రీతుల్లో ఆకృతుల్లో చేసేందుకు కుమ్మరి పడే ప్రయాస బహు గొప్పది.



ఉపాధ్యాయ వృత్తి కూడా అలాంటిదే. విద్యార్థుల తలరాతను మార్చే సాధనం విద్య అయితే అట్టి సాధనాన్ని ఉపయోగించే విధానాలను వివరించే వారే ఉపాధ్యాయులు. అందుకే ఉపాధ్యాయ వృత్తి విశిష్టమైనదిగా చెప్పబడింది. ఈ మేరకు, ఏదో ఆషామాషీగ విధులు నిర్వర్తించకుండా, విద్యార్థుల శ్రేయస్సుకై అంకిత భావంతో నిర్వహించాలని వెల్లడవుతోంది. ఒకరు, కవి కబీరుదాసును, మీరు గురువుకు లేదా దేవుడికి ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో ఎవరికి ముందు ప్రాధాన్యత ఇస్తారని ప్రశ్నిస్తే... కబీరుదాసు నేను కచ్చితంగా మొదటి ప్రాధాన్యత గురువుకే ఇస్తా, ఎందుకంటే దేవుని గురించి నాకు బోధించింది గురువే కదా అని జవాబిస్తాడు. అంతటి విశిష్టత ఇవ్వబడింది మరి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వేళ... ఒకరు, సర్. రైల్వే స్టేషన్ మాస్టర్ కు, స్కూలు మాస్టర్ కు తేడా ఏంటి అని ప్రశ్నిస్తాడు. దానికి సర్వేపల్లి వారు చాలా కూల్ గా... స్టేషన్ మాస్టర్... మైండ్స్ ది ట్రైన్, స్కూల్ మాస్టర్... ట్రైన్స్ ది మైండ్ అంటూ గంభీరంగా జవాబు ఇస్తారు. ఎంతటి గొప్ప జవాబో ఆలోచించండి. నా చిన్ననాటి పెరట్లో ఏదైనా కాస్తే మొదటిగా సమర్పించేది గుడిలో తదుపరి ఉపాధ్యాయునికే. అయితే, ఇప్పటి పరిస్థితి? పురాణాల్లో గురువులకు ఇవ్వబడిన ప్రాధాన్యత అనిర్వచనీయం. ఏకంగా రాజులనే శాసించిన గురువులను చూడవచ్చు. గురువు ప్రాధాన్యత గురించి పరిశీలిస్తే...

: అధ్యాపకుడు - అధ్యయనం చేయిస్తూ, విషయాన్ని తెలుపుతారు.

: ఉపాధ్యాయుడు - విషయమును వివరిస్తూ తెలుపుతారు.

: ఆచార్యుడు - విషయమును వివరిస్తూ దాని ఆచరణలో నైపుణ్యమును తెలుపుతారు.

: పండితుడు - విషయములు బహుగా తెలిసినవారు.

: గురువు - విషయమును తెలియజేస్తూ, విశ్లేషిస్తూ, నేర్పిస్తూ దాని ప్రయోజనము పొందుటకు సమగ్ర రీతుల్లో మార్గదర్శకం చేయువారు.

అవును, బోధనావృత్తి అతి విశిష్టమైనది. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్ణయమవుతుందని కొఠారి



కమిషన్ పేర్కొంది. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించే విధానాలు, ప్రవర్తించే శైలి పిల్లల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని వెల్లడవుతుంది. తమ తమ బోధనల ద్వారా విద్యార్థులను ప్రభావితం చేస్తూ, సమర్థవంతంగా విధులను నిర్వహిస్తే ఉత్తమ భావి భారత పౌరులు సమాజానికి అందించబడుతుంటారు. లేనిచో ఉత్త పౌరులే అందించబడుతూ వారు భారంగా మారుతుంటారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత పనితీరు కలిగి ఉంటుంది. ఎందుకనగా... అజ్ఞానిని జ్ఞానిగా, అవివేకిని వివేకిగా, సంస్కారం లేని వానిని సంస్కారిగా, ప్రతిభగల వారిని అత్యంత ప్రతిభ గలవారీగా, ఉన్నతులను మహోన్నతులుగా తీర్చిదిద్దవచ్చు. ఈ గొప్ప సదవకాశం ఉపాధ్యాయులకే ఉంటుంది. అందుకే, జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాతి స్థానం ఉపాధ్యాయులదే ! ఒక విధంగా తల్లిదండ్రులకు ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు. ఇష్టం, ఆసక్తులు లేకుండా బోధించడం, నేర్చుకోవడం రెండూ కష్టమే. ఆసక్తితో, ఇష్టపడుతూ బోధిస్తే, నేర్చుకుంటే స్వయం సంతృప్తి లభిస్తుంది. ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే మొదట ఆత్మవిశ్వాసం ముఖ్యం. చక్కని బోధనా నైపుణ్యాలతో ఆత్మవిశ్వాసంతో ఆయా సబ్జెక్టు విషయాలను బోధిస్తే విద్యార్థుల అంతర్గత శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలు బహిర్గతమవుతూ ,ప్రయోజకులవుతుంటారు. బోధన ప్రక్రియలో అల్పంగా ఉండకుండా, హుందాగా ప్రవర్తించాలి. ఎలాంటి పొరపాట్లకు తావివ్వక, భావోద్రేకాలను అదుపులో ఉంచుకుంటూ సమర్థవంతంగా విషయాలను బోధిస్తే విద్యార్థులు విషయాన్ని ఇట్టే పట్టేస్తుంటారు. ఉపాధ్యాయులు సామాజిక విజ్ఞతను ప్రదర్శిస్తూ, విద్యార్థులతో తల్లిదండ్రుల మాదిరిగా, తల్లిదండ్రులతో తోబుట్టువుగా, పెద్దలతో శ్రేయోభిలాషిగా, అందరి క్షేమం కోరేవాడిగా, అందరివాడిగా గుర్తించబడాలి. ఉపాధ్యాయుడంటే నిరంతరం నేర్చుకుంటూ ముందుకు వెళ్తేనే యదార్ధంగా చదువు చెప్పగలడని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నారు. బోధనాశైలిని నిరంతరం మెరుగుపరుచుకుంటూ వృత్తికే అంకితమవుతూ విద్యార్థుల ఉన్నతికై కృషి చేస్తే మట్టిలోని మాణిక్యాలు బయటపడి, వెలుగునిస్తాయి. అందుచేతనే ఉపాధ్యాయ వృత్తి అనేది ఆషామాషి వ్యవహారం కాదు. విద్యార్థుల (పిల్లల) భవిష్యత్తులతో ముడిపడే వృత్తి, అందుకే పవిత్రమైనది. ఉపాధ్యాయులు మోడల్ గా, మోరల్ గా ఉన్నప్పుడే ఉత్తములుగా గుర్తించబడుతుంటారు. వారే ప్రగతి నిర్దేశకులు. వారికి నా హృదయపూర్వక వందనములు. వ్యవస్థలో ఎవరికీ నిర్దేశించిన పనిని (జాబ్ చార్ట్) ఎవరికీ వారు నిక్కచ్చిగా, అంకిత భావంతో నిర్వహిస్తే అఖండమైన ఫలితాలను సాధిస్తూ , లక్ష్యాలను సునాయాసంగా చేధించవచ్చు. ఉపాధ్యాయులే ప్రగతి నిర్దేశకులు, ఇందులో ఏమాత్రం సందేహాలకు తావే లేదు. అందుచేతనే పవిత్రమైన వృత్తిగా చెప్పబడింది. అట్టి పవిత్రతను కాపాడుతూ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులందరికీ ముకుళిత హస్తాలతో నమస్కరిస్తున్నాను.

*డాక్టర్ ప్రభుదయాల్*
*మాజీ సెనేట్ మెంబర్ - కాకతీయ యూనివర్సిటీ*
*జీవిత సభ్యుడు - ఐఏటీఈ*
*నోడల్ అధికారి - కొత్తగూడెం*

## అధరహొ అనిపించాలంటే



అతివల పెదాల గురించి వర్ణించాలంటే పదాలు సరిపోవు. అయితే, గులాబీ రేకుల్లాంటి పెదాలు కంటపడితే దేవదాసు సైతం కాళిదాసుగా మారిపోతాడు. మరి మీ మోవి గని మోజుపడాలంటే.. అధరాలు తేనెలూరాలి. అలా ఉండాలంటే.. ఇదిగో ఇవి ప్రయత్నించండి..ఒక టేబుల్ స్పూన్ కలబంద జెల్‌లో కొద్దిగా తేనె కలపాలి. ఆ మిశ్రమాన్ని పెదాలకు రాసి 15 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. దాంతో పెదాలు హైడ్రేటెడ్‌గా మారుతాయి. సాఫ్ట్‌లుక్‌తో మెరుస్తాయి.ఆరోగ్యంతోపాటు అందానికి కూడా బీట్‌రూట్ ఉపయోగపడుతుంది. బీట్‌రూట్ రసాన్ని వేళ్లతో పెదాలపై మెత్తగా రుద్దాలి. కాసేపటి తర్వాత శుభ్రం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే.. మీ పెదాలు వర్ణరంజితమై ముద్దులొలుకుతాయి.

ఒక టీ స్పూన్ ఆల్మండ్ ఆయిల్, టీ స్పూన్ తేనె, రెండు స్పూన్ల చక్కెర ఒక కప్పులోకి తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదాలపై మెల్లగా రుద్దాలి. దీనివల్ల పెదాలపై ఏర్పడిన డెడ్‌స్కిన్ తొలగిపోతుంది. మోవిపై ఉన్న నల్లదనం మాయమై నల్ల ఇరుక్కే అనిపిస్తాయి.వెట్ న్యాప్‌కిన్‌తో గానీ, మెత్తని టూత్‌బ్రష్‌తో గానీ పెదాలపై మెల్లగా రుద్దాలి. దీని వల్ల పెదాలపై డ్రైగా ఏర్పడిన లేయర్ తొలగిపోతుంది. దీనివల్ల రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. రాత్రి సమయంలో నిద్రకు ఉపక్రమించే ముందు ఇలా చేయడం మంచిది. తర్వాత పెదాలకు కొబ్బరినూనె రాసుకుంటే మరీ మంచిది.

# వందేళ్లలో ఒక్కరే!



అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ)... దేశంలోని అతి పురాతన విశ్వవిద్యాలయాల్లో ఒకటి.
వందేళ్లు దాటిన ఈ వర్సిటీ చరిత్రలో తొలిసారి ఒక మహిళ వైస్‌చాన్సలర్ అయ్యారు.
ఏఎంయూలో విభిన్న హోదాల్లో సేవలందించిన ఆమె...
నేడు అదే విద్యాలయం అత్యున్నత పదవిని అలంకరించారు.
ప్రొఫెసర్ నయీమా ఖాతూన్ విజయవంతమైన ప్రయాణం ఇది...
వైస్ ఛాన్సలర్ నియమితులు కావడానికి ముందు నయీమా ఖాతూన్... అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) మహిళా కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. పొలిటికల్ సైకాలజీలో పీహెచ్‌డీ పట్టా పొందిన ఆమె... ఢిల్లీలోని 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్', ఏఎంయూల్లో పని చేశారు. ఏడాదిపాటు రువాండాలోని 'నేషనల్ యూనివర్సిటీ'లో బోధించారు. అమెరికాలోని 'లూయిస్ విల్లే యూనివర్సిటీ', రొమానియా 'అల్బా లూలియా', బ్యాంగ్‌కాక్ 'చులాలాంగ్‌కోర్న్ యూనివర్సిటీ' తదితర విద్యాలయాలను సందర్శించారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ప్రసంగించారు. ప్రముఖ జర్నల్స్‌లో ఆమె పరిశోధనా పత్రాలు ఎన్నో ప్రచురితమయ్యాయి. ఒడిశాలో పుట్టి పెరిగిన నయీమా... విద్యార్థి దశ నుంచీ చదువులో ముందుండేవారు. పట్టుదలగా ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. పీహెచ్‌డీ తరువాత ఏఎంయూలోని అదే విభాగం(1988)లో లెక్చరర్‌గా కెరీర్ ప్రారంభించారు. పదేళ్లకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2006లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2014లో మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యే సమయానికి ఆమె సైకాలజీ విభాగానికి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. దాంతోపాటు వర్సిటీ 'సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ కెరీర్ ప్లానింగ్'కు డైరెక్టర్‌గా సేవలు అందించారు.
ఆచార్యులుగానే కాకుండా రచయితగా, పరిశోధకురాలిగా నయీమా ఖాతూన్ సుపరిచితురాలు. ఆమె రచనలు పలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఆరు పుస్తకాలు రాశారు. క్లినికల్, హెల్త్, అప్లైడ్ సోషల్, స్పిరుట్యువల్ సైకాలజీల్లో స్పెషలైజేషన్ చేశారు. నైమా నిరుపమాన సేవలకు గానూ 'పాపా మియా పద్మభూషణ్ బెస్ట్ గర్ల్ అవార్డ్'ను అందుకున్నారు.
1875లో 'మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజీ'గా స్థాపితమైన విద్యా సంస్థ... 1920లో 'అలీఘడ్ ముస్లిమ్ యూనివర్సిటీ'గా రూపాంతరం చెందింది. 2020 సెప్టెంబర్‌లో ఏఎంయూ వందేళ్లు పూర్తి చేసుకుంది. ఇన్నేళ్లలో వర్సిటీకి వీసీగా వ్యవహరించిన మహిళ లేరు. ఆ లోటును నయీమా ఖాతూన్ భర్తీ చేశారు. 1920లో బేగమ్ సుల్తాన్ జహాన్ ఏఎంయూ చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ఆమె తరువాత ఏ మహిళా ఆ హోదాను అలంకరించలేదు.
ఇదిలావుంటే... నయీమా ఖాతూన్ భర్త ప్రొఫెసర్ మొహమ్మద్ గుల్రెజ్ మొన్నటివరకు వర్సిటీ తాత్కాలిక వీసీగా బాధ్యతలు నిర్వర్తించారు. యూపీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గత వీసీ తారిక్ మన్సూర్ తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఆ పోస్టు భర్తీ కోసం రూపొందించిన ఐదుగురి జాబితాలో నయీమా ఖాతూన్ కూడా ఉన్నారు. మొత్తం 36 మంది దరఖాస్తు చేసుకోగా... అందులో వడపోసి ఐదుగురిని ఎంపిక చేసింది వర్సిటీ పాలక మండలి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అధికారిక ముద్ర రాగానే కేంద్ర విద్యా శాఖ నయీమా ఖాతూన్‌ను వీసీగా ప్రకటించింది. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అనుమతి కోసం ఈసీకి లేఖ రాసింది. ఇందులో రాజకీయ ప్రయోజనాలు లేవని భావించిన ఈసీ... వర్సిటీ వీసీ నియామకానికి ఆమోద ముద్ర వేసింది. అలా శతాబ్దానికి పైగా చరిత్ర గలిగిన విశ్వవిద్యాలయానికి నయీమా మొట్టమొదటి మహిళా వైస్‌చాన్స్‌లర్ అయ్యారు. నవ అధ్యాయానికి నాంది పలికారు.
1875లో 'మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజీ'గా స్థాపితమైన విద్యా సంస్థ... 1920లో 'అలీఘడ్ ముస్లిమ్ యూనివర్సిటీ'గా రూపాంతరం చెందింది. 2020 సెప్టెంబర్‌లో ఏఎంయూ వందేళ్లు పూర్తి చేసుకుంది. ఇన్నేళ్లలో వర్సిటీకి వీసీగా వ్యవహరించిన మహిళ లేరు. ఆ లోటును నయీమా ఖాతూన్ భర్తీ చేశారు.

## నీళ్లు తాగితే మంచిదని ఎడాపెడా తాగేస్తున్నారా..



పిల్లలు మాట విననప్పుడు, తప్పు చేసినప్పుడు పెద్దలు గట్టిగా అరుస్తూ ఉంటారు. ఇది పిల్లల అభివృద్ధిలో దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం చూపుతుందట. అయ్యిందానికీ, కానిదానికీ బిగ్గరగా అరవడం వల్ల పిల్లల్లో ఒత్తిడి స్థాయులు అమాంతం పెరిగిపోతాయట. వారిలో ఆత్మవిశ్వాసం లోపిస్తుంది. పెద్దలు నిరంతరం అరుస్తూ ఉండటం వల్ల పిల్లలు తమ భావాలను ఎలా వ్యక్తీకరించాలో తెలియక తల్లడిల్లుతారు.
దీంతో ఒక్కసారిగా తమ భావోద్వేగాలను వారు బయటపెట్టేస్తారు. అంతేకాదు పిల్లల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు కూడా లోపిస్తాయి. దురుసు స్వభావం పెరుగుతుంది. మెదడు అభివృద్ధిపైనా దుష్ప్రభావం పడుతుంది. కుటుంబసభ్యులు తమమీద అరవడం కారణంగా పిల్లలు పెద్దలపట్ల తిరస్కార భావం అలవర్చుకుంటారు. అలా సంబంధాలు దెబ్బతింటాయి. కాబట్టి, పిల్లలతో సౌమ్యంగా, ప్రశాంతంగా మెలగాలి అంటున్నారు నిపుణులు.

**ఆనంద సూత్రాలు**

మనల్ని ఏది ఆనందంగా ఉంచుతుందనే దానిపై ఎన్నో అపోహలు ఉంటాయి. అయితే ఆనందం అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ. అది ఒక స్థితి. కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా ఎప్పుడూ ఆనందంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. జాగరూకత, ఇతరులతో సత్సంబంధాలు ఏర్పర్చుకోవడం, ప్రతిరోజు చిన్నచిన్న లక్ష్యాలను సాధించడం, ఎదుటివారి పట్ల దయతో మెలగడం, క్రమం తప్పకుండా చేసే వ్యాయామం మనల్ని ఎప్పటికప్పుడు ఆనందంగా ఉంచుతాయని మానసిక నిపుణులు సలహా ఇస్తున్నారు.

**ఎన్ని నీళ్లు తాగాలి?**

మన శరీరం సరిగ్గా పనిచేయాలంటే తగినన్ని నీళ్లు తాగాలనే విషయం తెలిసిందే. అయితే నీళ్లు మోతాదుకు మించి తాగితే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయంటున్నారు వైద్యులు. నీళ్లు మితిమీరి తాగడం వల్ల శరీరంలో ఎలక్ట్రొలైట్ ఇంబాలెన్స్ ఏర్పడుతుంది. ఇది గుండె సమస్యలకు కారణమవుతుంది. రెండున్నర లీటర్ల నుంచి నాలుగు లీటర్ల వరకు ఫర్వాలేదు కానీ, అంతకుమించొద్దని సూచిస్తున్నారు.
వేడి వాతావరణంలో శరీర శ్రమ చేసేవాళ్లు మూడు నుంచి మూడున్నర లీటర్ల నీళ్లు తాగొచ్చట. అదే గుండె వైఫల్యం, కిడ్నీ వ్యాధులు ఉన్నవాళ్లు మాత్రం ఒకటిన్నర లీటర్ల వరకు పరిమితం చేసుకోవాలట. ఇంకోమాట శరీర బరువు నీళ్లు తాగే నిష్పత్తిని 0.03 రెట్లు ఉండేలా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అంటే 70 కిలోల బరువుండే వ్యక్తి 2.1 లీటర్ల నీళ్లు తీసుకోవాలన్నమాట! ఈ లెక్కలు అలా ఉంచితే అన్నిటికీ మించి దాహం వేయడమే నీళ్లు తాగడానికి సంకేతంగా భావించాలి. అంతేతప్ప అదేపనిగా నీళ్లు మాత్రం తాగేయవద్దు.

# బహుళ బాధ్యతల్లో మహిళలదే పై చేయి




వెనువెంటనే ఒకటి రెండు రకాల బాధ్యతల్ని నిర్వహించాల్సి వస్తే పురుషులు విపరీతంగా అలసిపోతుంటారు. అదే స్త్రీలు నాలుగైదు రకాల పనుల్ని వెంటవెంటనే చేపట్టినా, అలసటకు గానీ, ఆయాసానికి గానీ గురికారు. ఈ రహస్యమేమిటో కనుగొనడానికి రష్యాలోని నేష్నల్ రీసెర్చ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు రెండేళ్ల క్రితం సిద్ధమయ్యారు. ఒకేసారి ఎక్కువ పనుల మీద మనసు లగ్నం చేయాల్సి వచ్చినప్పుడు సహజంగానే మెదడులోని కొన్ని అదనపు విభాగాలకు పని చెప్పాల్సి ఉంటుంది. అందుకు చాలా ఎక్కువ శక్తే ఖర్చవుతుంది. అయితే స్త్రీలతో పోలిస్తే పురుషుల్లోని శక్తి ఎన్నో రెట్లు అదనంగా ఖర్చవుతుందని పురుషులు తీవ్రంగా అసహనానికీ, అలసటకూ గురికావడానికి ఇదే కారణమని పరిశోధనల్లో వెల్లడయ్యింది. ఎక్కువ విషయాల్లో మనసును లగ్నం చేయాల్సి వచ్చినప్పుడు పురుషుల్లోని డార్సోలేటరల్ ప్రీఫ్రంటల్ విభాగాల్లోని కొన్ని వ్యవస్థలు విపరీతంగా పనిచేయడం మొదలవుతుంది. అయితే స్త్రీలలో ఈ పరిస్థితి కనిపించదు. 20, 45 ఏళ్ల స్త్రీ, పురుషుల్లో ఈ వ్యత్యాసాలు చాలా ఎక్కువగా కనిపిస్తాయి. లింగభేదం, వయసు వంటి విషయాల్ని అలా ఉంచితే, ఎక్కువ పనుల మీద మనసు పెట్టినప్పుడు స్త్రీ, పురుషులు ఇరువురిలోనూ మెదడుకు సంబంధించిన డార్సోలేటరల్ ప్రీఫ్రంటల్, ఇన్‌సీరియర్ పెరియేటల్ లోబ్స్, ఇన్‌ఫీరియర్ ఆక్సిపీటల్ జీరస్ విభాగాలు బాగా పనిచేస్తుంటాయి. అయితే పురుషుల్లో వీటికి అదనంగా, సప్లిమెంటరీ మోటార్ విభాగాలు, ఇన్సులా కూడా పనిచేయడం మొదలెడతాయి. స్త్రీలలో ఈ స్థితి ఉండదు. పురుషుల్లో మాత్రమే ఈ అదనపు విభాగాలు పని చేయాల్సి రావడం వల్లే పురుషులు స్త్రీలకన్నా ఎక్కువగా, త్వరగా అలసిపోతుంటారని పరిశోధనల్లో వెల్లడయ్యింది. ఈ అలసట లేనందువల్లే స్త్రీలు ఒక విషయం నుంచి మరో విషయంలోకి అవలీలగా ప్రవేశించగలుగుతారని కూడా పరిశోధకులు చెబుతున్నారు. ఎం.ఆర్. ఐ., కొన్ని రకాల న్యూరోసైకలాజికల్ పరీక్షలతో పాటు డీ- కెఈఎఫ్ఎస్ (ట్రయల్ మేకింగ్ టెస్ట్), వెస్లర్ మెమొరీ స్కేల్ వంటి పరీక్షల ఆధారంగా ఈ వ్యత్యాసాల్ని పరిశోధకులు కనుగొన్నారు. ఈ వివరాలు ఇటీవలి హ్యూమన్ ఫిజియాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## ఆర్థిక మంత్రి మీరే!



పొదుపులో మహిళలదే పైచేయి. అవును మరి! నెలసరి సంపాదనతో కుటుంబాన్ని గుట్టుగా గట్టెక్కించే క్రమంలో మహిళలు పట్టు పెంచుకున్న అంశమది. అయితే డబ్బు పొదుపులో పైచేయి సాధించిన మహిళలు మదుపు దగ్గరకొచ్చేసరికి బెంబేలవుతున్నారని సర్వేలు అంటున్నాయి. ఈ సర్వేలను తిరగరాయాలంటే మహిళలు ఈ ఆర్థిక సూత్రాలు పాటించాలి.
కుటుంబపరమైన ఆర్థిక అంశాల్లో తమకంటే పురుషులే మేలనే భావన వదిలించుకుని దాన్లో తమ పాత్ర పరిధి పెంచాలి. అందుకోసం సమయాన్ని కేటాయించటం మొదలుపెట్టాలి. మ్యూచువల్ ఫండ్స్, సేవింగ్స్ మొదలైన విషయాల్లో చురుగ్గా వ్యవహరించాలి.
పర్సనల్ ఫైనాన్స్ మీద పట్టు కోసం ఫైనాన్స్ లేదా పెట్టుబడికి సంబంధించిన కోర్సులు అభ్యసించాలి. ఇల్లు కట్టుకోవటం మీ లక్ష్యమైతే అందుకోసం ఎలా, ఎంతకాలం, ఎంత పొదుపు చేయాలనుకుంటున్నారో ఆ ప్లానింగ్ గురించి దంపతులిద్దరూ చర్చించుకోవాలి. ఆ లక్ష్యాన్ని చేరుకోవటం కోసం ఎందులో పెట్టుబడి పెట్టొచ్చో నిర?యించుకోవాలి. స్నేహితుల ఆర్థిక సలహాల మీద ఆధారపడకూడదు. ఇందుకోసం అనుభవం ఉన్న ఆర్థిక నిపుణుడిని సంప్రదించాలి. అలాగే అతను సూచించే పెట్టుబడి మార్గాలను గుడ్డిగా అనుసరించకుండా, సందేహాలుంటే అతన్నే అడిగి నివృత్తి చేసుకుని ముందుకు సాగాలి.

## కనుబొమలకూ మర్దన!



కనుబొమలు తీరైన ఆకృతిలోకి రావాలంటే పార్లర్‌కు వెళ్లి త్రెడింగ్ చేయించుకుంటాం. ఇంట్లో అప్పుడప్పుడూ ప్లక్కర్‌తో అవాంఛితంగా పెరిగిన వాటిని తీసేస్తాం. ఏది చేసినా కొద్దిగా నొప్పి, అక్కడి చర్మం ఎర్రగా కందిపోవడం వంటి సమస్యలు మామూలే. ఇలాంటివేవీ లేకుండా ఇప్పుడు కొత్త పద్ధతి అందుబాటులోకి వచ్చిందట. అదే ఐబ్రో పిన్చింగ్. అంటే కనుబొమలను నొక్కినట్లు చేయడం. లండన్, న్యూయార్క్‌లోని ఓ ప్రముఖ బ్యూటీపార్లర్ తన శాఖలన్నింట్లో దీన్ని ప్రవేశపెట్టడంతో ఇప్పుడు ఇది అంతర్జాలంలో హల్‌చల్ చేస్తోంది. కనుబొమలను సున్నితంగా నొక్కుతూ, వాటికి మర్దన చేస్తూనే అవి సరైన ఆకృతిలో వచ్చేలా చూస్తారు. దీనివల్ల ఆ భాగంలో రక్తప్రసరణా సజావుగా సాగుతుందట. ఇది బొటాక్స్ కంటే మెరుగైందని చెబుతున్నారు సౌందర్య నిపుణులు. కనుబొమలు షేప్ చేయించునేటప్పుడు వచ్చే వాపూ తగ్గుతుందని, ఆ భాగంలో గీతలు, ముడతలు లాంటివి పడవని అంటున్నారు. ఈ చికిత్స మూలాలు ఆయుర్వేదంలో ఉన్నాయని అంటున్నారు కొందరు వైద్యులు. ఆయుర్వేదం ప్రకారం శరీరంలో కొన్ని ప్రదేశాల్లో ఒత్తిడి పెంచడం ద్వారా మిగతా భాగాలకు సాంత్వన చేకూరుతుంది. ఇదీ అలాంటిదేనని అంటున్నారు. సాధారణంగా కంటి చుట్టూ ఉండే కణజాలం వదులవడం వల్ల ఆ ప్రాంతంలో వాపు కనిపిస్తుంది. మృదువుగా మర్దనా చేస్తే ఆ సమస్య అదుపులో ఉంటుంది. కళ్లూ ఆరోగ్యంగా ఉంటాయి. దీనికోసం నిపుణుల దగ్గరకే వెళ్లాలని లేదు. ఇంట్లోనూ ప్రయత్నించొచ్చు. ఎలాగంటే... చల్లటి ఐసు ముక్క లేదా వస్త్రాన్ని ఆ ప్రాంతంలో అద్దినట్లు చేసినా చాలు. షేపింగ్, ఫేషియల్స్ తరువాత దీన్ని చేయడం వల్ల హాయిగా అనిపిస్తుంది.

## గదులకు సరికొత్త నగిషీలు!

గదిలో ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవటానికి 'లాఫ్టెడ్ డిజైన్' ఒక చక్కని మార్గం. దీనివల్ల గదులు ఆధునికంగా కనిపించటమే కాదు.. ఇంట్లోని ఖాళీ ప్రదేశాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవటానికి, గదిలో ఆహ్లాదాన్ని సృష్టించటానికి పలు మార్గాలను చూపుతుంది.
గదులకు విలాసవంతమైన డిజైనింగ్ చేయటంలో గోడలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఫ్యాబ్రిక్, త్రీడీ బోర్డ్, రకరకాల చిత్రాలతోనూ లేదా మెటల్, మార్బుల్ పలకలతోనూ గోడల ఉపరితలాన్ని కవర్ చేయటం ద్వారా విలాసవంతంగా కనిపిస్తాయి.గదిలో ఉండే స్థలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలంటే వివిధ రకాల ఆకృతులు, ఫీచర్లతో ఉండే వస్తువులను ఉపయోగించుకోవాలి. దీనికి అలమరాలు చక్కగా ఉపయోగపడతాయి. వాడటం సులభం. శుభ్రంగా ఉంచితే గదికి కొత్త అందాల్ని అద్దుతాయి.సాధారణంగా లైట్లు అనగానే కాంతికోసం అనే దృష్టితో చూస్తారు కానీ, గది వాతావరణానికి వీటితో లగ్జరీ లుక్ తీసుకురావొచ్చు. రకరకాల లైట్లను వాడటం ద్వారా గదిలో రకరకాల వేరియంట్స్‌ను సృష్టించొచ్చు.గోడలకు ఎక్కువ సంఖ్యలో అద్దాలు అమర్చటం ద్వారా గది విశాలంగా కనిపిస్తుంది. గదిని బట్టి కూడా అద్దాలను ఏర్పాటు చేసుకోవచ్చు. చేంజింగ్ రూమ్ అయితే హృదయాకారం, నక్షత్రాల ఆకారంలో ఉండే అద్దాలను ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివల్ల ఆ గది అందం రెట్టింపు అవుతుంది.వాల్‌పేపర్లు గదిలో ఉండే స్థలానికి మంచి లుక్‌ను తెస్తాయి. మీకు బాగా ఇష్టమైన డిజైన్‌ను ఎంచుకోండి. గదిని చూడగానే కలిగే ఫీల్‌పై బ్యాగ్రౌండ్ కలర్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

# డయాలసిస్ మానకండి!

**మూత్ర పిండాల సమస్య ఉన్న రోగులకు లాక్‌డౌన్ క్లిష్టంగా మారింది. ప్రయాణ సాధనాల కొరత ఉన్నప్పటికీ క్రమం తప్పకుండా డయాలసిస్ చేయుంచుకోవడం ఆలస్యం చేయకూడదు అంటున్నారు వైద్యులు!**



మూత్రపిండాలు ఫెయిల్ అయిన వారిలో రోగనిరోధకశక్తి తక్కువ. కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ డిస్టెన్సింగ్ వీరు కచ్చితంగా పాటించాలి.
చికిత్స కోసం బయటకు వెళ్లడం కోసం సొంత వాహనం వాడడం మేలు. డయాలసిస్ సెంటర్‌లో కూడా సోషల్ డిస్టెన్సింగ్ పాటిస్తూ, శానిటైజర్లను వాడుకోవాలి.
సమయానికి డయాలసిస్ చేయించుకోకపోతే, కార్డియాక్ అరెస్ట్ అనే గుండె ఆగిపోయే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉంటుంది. కాబట్టి క్రమం తప్పక వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.
డయాలసిస్ సెంటర్లకు ప్రయాణించడం ఇబ్బందిగా మారిన ప్రస్తుత సమయంలో, ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవడం తగ్గించాలి. అలాగే తీసుకునే ఆహారం పట్ల కూడా జాగ్రత్తలు పాటించాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
6 | హైదరాబాద్
సోమవారం
09 । సెప్టెంబర్ । 2024



## హైదరాబాద్‌లో అజిలిసియం సెంటర్



**హైదరాబాద్- నవభూమి:** అంతర్జాతీయ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు డాటా ఇన్నోవేషన్ సేవలు అందిస్తున్న అజిలిసియం..తాజాగా హైదరాబాద్‌లో కొత్తగా డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. భారత్‌లో తన ఉనికిని బలోపేతం చేయడానికి ఈ సెంటర్‌ను నెలకొల్పుతున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో రాజ్ బాబు తెలిపారు.కొత్తగా ఏర్పాటు చేసిన ఈ సెంటర్ నుంచి అధునాతన డాటా, అనలిటిక్స్ సొల్యూషన్స్ సేవలు అందించడానికి వినియోగించనున్నట్లు చెప్పా రు. ప్రస్తుతం భారత్‌లో సంస్థకు 700 మంది ఉద్యోగులు ఉండగా, ఈ ఏడాది చివరినాటికి ఈ సంఖ్యను వెయ్యికి పెంచుకోనున్నట్లు ప్రకటించారు.
వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీ సెంటర్‌ను నెలకొల్పినట్లు, పెరుగుతున్న ఫార్మాస్యూటికల్స్ క్లయింట్లకు మెరుగైన సేవలు అందించడానికి వీలు పడనున్నదన్నారు.




## 17 కోట్లకు డీమ్యాట్ ఖాతాలు



**న్యూఢిల్లీ- నవభూమి:** భారత్‌లో స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నారు. దీంతో డీమ్యాట్ ఖాతాలు తెరిచేవారు కూడా అధికమవుతున్నారు. గత నెలలో కొత్తగా 40 లక్షల మంది డీమ్యాట్ ఖాతాలు తెరవడంతో మొత్తం సంఖ్య 17 కోట్లకు చేరుకున్నాయని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్), సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్(సీడీఎస్ఎల్) తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.
గత నెలలో రికార్డుస్థాయిలో ఐపీవోలు జరగడం ఇందుకు కారణం. 10 కంపెనీలు ఐపీవో ద్వారా రూ.17 వేల కోట్ల నిధులను సేకరించాయి. ప్రస్తుతేడాది ప్రతి నెలలో సరాసరిగా 40 లక్షల చొప్పున డీమ్యాట్ ఖాతాలు తెరవడంతో మొత్తంగా 3.2 కోట్లు తెరిచారు. 2024 జనవరి నుంచి ఆగస్టు 31 వరకు 50 కంపెనీలు ఐపీవోకి రాగా, ఈ సంస్థలు మొత్తంగా రూ.53 వేల కోట్ల నిధులను సమీకరించాయి. అలాగే ఈ ఏడాది సెన్సెక్స్ 13 శాతం రిటర్నులు పంచగా, నిఫ్టీ 15 శాతం రిటర్నులు పంచింది.

## ఎక్స్‌టర్‌లో సరికొత్త వెర్షన్లు ప్రారంభ ధర రూ.7.86 లక్షలు




**చెన్నై- నవభూమి:** ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్ మోటర్..దేశీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన స్పోర్ట్స్ యుటిలిటీ వాహనమైన ఎక్స్‌టర్‌లో మరో రెండు మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంట్లో మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ కలిగిన ఎస్(వో)ప్లస్ రకం ధర రూ.7,86,300గాను, ఎస్ ప్లస్ రకం ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్(ఏఎంటీ) రకం రూ.8,43,900గా నిర్ణయించింది.
ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. పాతదాంతో పోలిస్తే నయా వెర్షన్‌లో కొత్త ఫీచర్స్‌ను జోడించినట్లు ముఖ్యంగా స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, డిజిటల్ క్లస్టర్, ఎనిమిది ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టం, యాపిల్ కార్‌ప్లే, రియర్ ఎయిర్-కండిషనర్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, అన్ని సీట్లకు సీట్‌బెల్ట్, టైర్-ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ కంట్రోల్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. గత నెలలో కంపెనీ అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 12 శాతం తగ్గి 63,175 యూనిట్లకు పడిపోయాయి.

## కేరళలో కిమ్స్ విస్తరణ



**హైదరాబాద్- నవభూమి:** ప్రముఖ హెల్త్‌కేర్ సేవల సంస్థ కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్) వ్యాపారాన్ని ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తున్నది. తాజాగా కేరళలో అడుగుపెట్టింది. కన్నూర్‌లోని శ్రీ చంద్ హాస్పిటల్‌తో కుదుర్చుకున్న దీర్ఘకాలిక ఒప్పందంలోభాగంగా కిమ్స్ నిర్వహణ, మేనేజ్‌మెంట్ బాధ్యతలు నిర్వహించనున్నది.
వచ్చే నెల 1 నుంచి కిమ్స్ అనుబంధ సంస్థ కిమ్స్ స్వస్థ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కిమ్స్ బీఎస్ఈకి సమాచారం అందించింది. 2020లో ప్రారంభమైన ఈ ఆసుపత్రిలో 189 పడకలు, ఆరు ఆపరేషన్ థియేటర్లు, ఒక్క క్యాథ్ లాబ్ ఉన్నాయి.

## చందా కొచ్చర్‌కు నోటీసులు



**న్యూఢిల్లీ- నవభూమి:** ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ రుణ కేసులో వీరిద్దరు అరెస్ట్ అక్రమమంటూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.
దీంతో శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్ నేతృత్వంలోని ప్రత్యేక బెంచ్ నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి వివరణ ఇవ్వాలని ఈ నోటీస్‌లో ఆదేశించించింది. డిసెంబర్ 23, 2022లో వీరిద్దరిని సీబీఐ అరెస్ట్ చేసింది.

# బేర్‌మన్న స్టాక్ మార్కెట్లు.. వెయ్యి పాయింట్లకుపైగా నష్టపోయిన సెన్సెక్స్



**న్యూఢిల్లీ- నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. రికార్డు స్థాయిలో దూసుకుపోయిన సూచీల ర్యాలీకి భారీ బ్రేక్‌పడింది. అంతర్జాతీయ మార్కెట్లు సృష్టించిన అలజడి కారణంగా మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా శుక్రవారం సూచీలకు బ్లాక్‌డేగా నిలిచింది. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు సమయం గడుస్తున్నకొద్దీ మరింత ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత బలహీనపడుతున్నట్లు వచ్చిన సంకేతాలకు తోడు ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గింపును వాయిదావేసే అవకాశం ఉన్నట్లు వచ్చిన వార్తలు మదుపరులపై ఆందోళనకు నెట్టింది.ఇంట్రాడేలో 1,200 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 1,017 పాయింట్లు నష్టపోయి 82 వేల దిగువకు పడిపోయింది. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 81,183.93 వద్ద ముగిసింది. దీంతో సూచీ రెండువారాల కనిష్ఠ స్థాయికి పడిపోయినట్లు అయింది. ఆగస్టు 23 తర్వాత సూచీలకు ఇదే కనిష్ఠ స్థాయి ముగింపు. మరో సూచీ నిఫ్టీ 292.94 పాయింట్లు(1.17 శాతం) నష్టపోయి 25 వేల దిగువకు 24,852.15 పాయింట్ల వద్ద ముగిసింది.
సూచీలు వరుసగా నష్టపోవడం ఇది మూడో రోజు. ఐటీ, చమురు అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో జోరుగా క్రయవిక్రయాలు జరిగాయి. సోమవారం చారిత్రక గరిష్ఠ స్థాయి 82,725.28 పాయింట్లకు చేరుకున్న సూచీ ఆ మరుసటి రోజు నుంచి దిగువముఖంగా పయనించింది.

**ఎస్బీఐ షేరు ధమాల్**

బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ షేరు అత్యధికంగా 4.40 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తడం ఇందుకు కారణమని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. దీంతోపాటు ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కొటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఒక్క శాతం వరకు నష్టపోయాయి.
ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్, రిలయన్స్, టాటా మోటర్స్, ఐటీసీ, అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రాలు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి.
వీటితోపాటు అల్ట్రాటెక్ సిమెంట్, మారుతి, టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్, బజాజ్‌ఫిన్‌సర్వ్, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్, నెస్లె, సన్‌ఫార్మా షేర్లు పతనం చెందాయి.
ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌యూఎల్ లాభాల్లో ముగిశాయి.
మొత్తం షేర్లలో 2,541 సూచీ నష్టపోగా, 1,406 సూచీలు లాభాల్లో ముగిశాయి. కానీ 87 షేర్లు యథాతథంగా ఉన్నాయి.
ఈ వారంలో సెన్సెక్స్ 1,181.84 పాయింట్లు(1.43 శాతం), నిఫ్టీ 383.75 పాయింట్లు(1.52 శాతం) నష్టపోయాయి.
రంగాలవారీగా చూస్తే టెలికం, ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, సేవలు దిగువముఖం పట్టాయి.
ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి.
యూరోపియన్ సూచీలు కూడా నష్టాల్లో ట్రేడవుతున్నాయి.
గ్లోబల్ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర స్వల్పంగా పెరిగి 73 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

**5.50 లక్షల కోట్ల సంపద ఆవిరి**

పెట్టుబడిదారులకు శుక్రవారం బ్లాక్ ఫ్రైడేగా నిలిచింది. దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలడంతో మదుపరులు 5 లక్షలకోట్లకు పైగా సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిట్కస్టైన సంస్థల విలువ రూ.5,49,925.16 కోట్లు కరిగిపోయి రూ.4,60,18,978.09 కోట్లకు(5.48 ట్రిలియన్ డాలర్లకు) పడిపోయింది.

**నష్టాలకు కారణాలు**

అమెరికా నిరుద్యోగ గణాంకాలు విడుదల కానుండటంతో మదుపరులు ముందు జాగ్రత్తలో భాగంగా అమ్మకాలకు మొగ్గుచూపారు.
ఫెడరల్ రిజర్వు ఛైర్మన్ వడ్డీరేట్ల తగ్గింపు నిర్ణయం వాయిదా వేసే అవకాశం ఉన్నదన్న వార్తలు కూడా..
మార్కెట్ నియంత్రణ మండలి సెబీ..విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల వెల్లడికి గడువును విధించడం

# కాంట్రాక్టర్లకు 25 వేల కోట్ల బకాయిలు.. కర్ణాటకలో అభివృద్ధి పనులకు బ్రేకులు



**న్యూఢిల్లీ- నవభూమి:** కర్ణాటకలో అభివృద్ధి పనులకు బ్రేకులు పడుతున్నాయి. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు పెరిగిపోతున్నాయి. దీంతో బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేస్తున్నారు. ఇప్పటికే అప్పులు చేసి పనులు జరిపామని, ఇక బిల్లులు రాకపోతే పనులు కొనసాగించలేమని చేతులెత్తేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పడకేసిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎలాగైనా అధికారంలోకి రావాలనే యావతో ఇచ్చిన గ్యారెంటీలే ఇప్పుడు రాష్ట్రం పాలిట గుదిబండగా, అభివృద్ధికి అడ్డంకిగా మారాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
కర్ణాటకలో గత ఏడాది మే నెలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేటప్పటికి కాంట్రాక్టర్లకు రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం మారాక తమ బిల్లులు మంజూరవుతాయని ఆశించారు. కానీ, బిల్లుల బకాయిలు రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్లకు పెరిగాయి. దీంతో కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు వేగంగా జరపడం లేదు. చాలా పనులు నిలిచిపోయాయి. బృహత్ బెంగళూరు మహానగర పాలికె సైతం కాంట్రాక్టర్లకు రూ.3,200 బిల్లులు చెల్లించాల్సి ఉండటంతో నగరంలో పనులు వేగంగా జరగడం లేదు.

# బ్యాంకుల్లో డిపాజిట్ చేసేవారు తరిగిపోతున్నారు..



**న్యూఢిల్లీ-నవభూమి:** డిపాజిట్లు ఆకట్టుకోవడంలో బ్యాంకులు విఫలమవుతున్నాయి. ఒకవైపు రుణాలు తీసుకునేవారి సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఇదే తరుణంలో డిపాజిట్ చేసేవారు తరిగిపోతున్నారు. దీంతో బ్యాంకింగ్ రంగం తీవ్ర సంక్షోభం నెదుర్కొంటున్నది. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో బ్యాంకింగ్ డిపాజిట్లలో 11.7 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, ఇదే సమయంలో రుణాల్లో వృద్ధి 15 శాతంగా ఉన్నదని పేర్కొంది.
ఈ రెండింటి మధ్య అంతరం అంతకంతకు పెరుగుతుండటంపై అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రిజర్వుబ్యాంక్‌లు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ముఖ్యంగా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి బ్యాంకింగ్‌లు ప్రత్యేక దృష్టి సారించడం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బహిరంగంగానే విమర్శించారు. ఆకర్షణీయమైన డిపాజిట్లను ప్రకటించాలని సూచించారు. ఈ నెలమొదట్లో ప్రభుత్వ బ్యాంకుల అధిపతులతో సమావేశమై ఈ విషయాన్ని సూచించారు.
ఈక్విటీలు అధిక రిటర్నులు
గతంలో బ్యాంక్‌లలో డిపాజిట్ చేయడానికి ముందుకొచ్చిన ప్రజలు..ప్రస్తుతం అధిక రిటర్నులు పంచే వాటివైపు మొగ్గుచూపుతున్నారు. దీంట్లో రిస్క్‌వున్న ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్నారు. ముఖ్యంగా ఈ ఏడాదికాలంలో డీమ్యాట్ ఖాతాలు పెరిగిందన్న నివేదిక ఈ విషయాన్ని బహిర్గతం చేస్తున్నది. ఈ ఏడాదికాలంలో ఈక్విటీలు 14 శాతం రిటర్నులు పంచింది.

# భారీగా తగ్గిన బంగారం ధరలు.. మీ నగరంలో ఎంతంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** వినాయకచవితి సందర్భంగా శనివారం స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు.. ఆదివారం భారీగా తగ్గాయి. తులం బంగారం ధర నిన్నటితో పోల్చితే రూ.410 తగ్గింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.72,870లు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,800ల వద్ద కొనసాగుతోంది. ఈ ఏడాది భారత్‌లో బంగారం వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేస్తున్నందున.. ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. కాబట్టి.. గోల్డ్ కొనేవారికి ఇప్పుడే మంచి అవకాశం. దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు, తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.
కోల్‌కతాలో10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,800గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.72,870 వద్ద ఉంది.
దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగార ధర రూ.66,950కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 73,020 వద్ద కొనసాగుతోంది.
చెన్నైలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,880గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,870 వద్ద కొనసాగుతోంది.
ముంబయిలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,800గా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ. 72,870వద్ద ట్రేడవుతోంది.
తెలుగు రాష్ట్రాలు..
తెలుగు రాష్ట్రాల్లోనూ బంగారం ధరలు తగ్గాయి. హైదరాబాద్‌లో ఇవాళ10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,800గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,870గా ఉంది. విజయవాడలో కూడా 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,800, 24 క్యారెట్ల బంగారం ధర రూ.72,870గా ఉంది. విశాఖపట్నం సహా ఏపీలోని ప్రధాన నగరాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి.
వెండి ధరలు...
ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 84,500గా ఉండగా.. కోల్‌కతాలో రూ. 85 వేలు, బెంగళూరులో రూ. 82,900 వద్ద ట్రేడవుతోంది. హైదరాబాద్, విశాఖ, విజయవాడలో కిలో వెండి ధర అత్యధికంగా రూ. 89,500 గా ఉంది.

## రిటైర్ మెంట్ వరకు రూ. 8 కోట్లు కావాలంటే.. నెలకు ఎంత సేవ్ చేయాలి..



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రస్తుత కాలంలో చాలా తక్కువ మంది మాత్రమే పదవీ విరమణ కోసం ప్లాన్ చేస్తున్నారు. కానీ ఇప్పటి నుంచే పదవీ విరమణ కోసం కొంత డబ్బును ఆదా చేస్తే ఆ సమయంలో ఎవరిపై ఆధారపడకుండా ప్రశాంతంగా ఉండవచ్చు. సాధారణ ఆదాయం కోసం ప్రజలు ఇప్పటికే వివిధ పథకాల్లో పెట్టుబడి పెడుతున్నారు. అయితే మీరు రిటైర్ మెంట్ సమయంలో పలు రకాల ఖర్చుల కోసం రూ.8 కోట్లు రావాలని ప్లాన్ చేసుకుంటే ఎందులో పెట్టుబడి చేయాలి. ఎన్నేళ్లు ఇన్వెస్ట్ చేయాలనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.
ఎంత సేవ్..దీర్ఘకాంలో పెట్టుబడులు చేయాలంటే మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లు బెస్ట్ అని చెప్పవచ్చు. ఎందుకంటే ఇటీవల సంవత్సరాలలో భారతదేశంలో ఇవి మంచి ప్రజాదరణ పొందాయి. దీంతోపాటు వీటిలో కనీసం 10 శాతానికి పైగా రిటర్న్స్ వస్తుండటంతో అనేక మంది వీటివైపు మొగ్గుచూపుతున్నారు. వీటిని పెట్టుబడిదారులు చిన్న మొత్తంతో కూడా ప్రారంభించవచ్చు. అయితే రూ.8 కోట్ల మొత్తం కావాలంటే నెలకు ఎంత సేవ్ చేయాలి, ఏన్నేళ్లు పెట్టుబడి పెట్టాలనే విషయాలను ఇప్పుడు చూద్దాం.
వడ్డీ రూపంలోనే..ఇక రిటైర్ మెంట్ సమయానికి రూ.8 కోట్ల కార్పస్ కావాలంటే నెలకు రూ. 12,320 సిప్ విధానంలో పెట్టుబడి పెట్టాలి. ఆ క్రమంలో 35 ఏళ్లు ఇన్వెస్ట్ చేయాలి. ఆ విధంగ చేస్తే మీ మొత్తం పెట్టుబడి రూ.51,74,400 అవుతుంది. అదే సమయంలో మీకు వచ్చేది మాత్రం రూ. 8 కోట్ల 00 21 వేల 715 వస్తుంది. ఈ నేపథ్యంలో మీకు 7 కోట్ల 48 లక్షల 47 వేల 315 రూపాయలు వడ్డీ రూపంలోనే లభిస్తుంది. వార్షిక రాబడి 12 శాతం చొప్పున తీసుకుంటే ఈ మొత్తం వస్తుంది. సిప్ విధానంలో ప్రస్తుతం వార్షిక రాబడి 12 శాతానికి పైగా లభిస్తుంది.అదనంగా..ఒకవేళ మీకు ఇదే సమయంలో రాబడి 15 శాతం వస్తే మీకు అదనంగా మరో 10 కోట్లు ఎక్కువ వస్తాయి. అంటే మొత్తం రూ. 18 కోట్ల 30 లక్షల 83 వేల 145 లభిస్తాయి. మీరు కూడా మీ పదవీ విరమణ తర్వాత పెద్ద మొత్తాన్ని పొందాలనుకుంటే ఈ సిప్ విధానాన్ని ఎంచుకోవచ్చు. మీరు తక్కువ వయసులో పెట్టుబడి ప్రారంభించడం ద్వారా పదవీ విరమణ సమయానికి ఎక్కువ మొత్తాన్ని పొందవచ్చు.

## వచ్చే వారం రూ. 6,560 కోట్ల ఐపీఓ.. ప్రైస్ బాండ్ ఎంతంటే..

**న్యూఢిల్లీ- నవభూమి:** వచ్చే వారం బజాజ్ గ్రూప్‌కి చెందిన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్( కంపెనీ బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ సోమవారం(సెప్టెంబర్ 9న) ప్రారంభం కానుంది. ఈ ఐపీఓ ద్వారా రూ.6,560 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో పెట్టుబడిదారులు సెప్టెంబర్ 9 నుంచి సెప్టెంబర్ 11, 2024 వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ కంపెనీ షేర్ల ముఖ విలువ ఒక్కో షేరుకు రూ.10. ఈ కింద కంపెనీ రూ. 3,560 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తోంది. రూ. 3,000 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయించనున్నారు. కంపెనీ షేర్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లో లిస్ట్ చేయబడతాయి. మీరు కూడా ఈ పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నట్లయితే, ముందుగా దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను ఇక్కడ తెలుసుకుందాం.
ప్రైస్ బాండ్..ఈ ఇష్యూలో దాదాపు 50 శాతం క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ కొనుగోలుదారులకు, 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు (ఎన్ఐఐలు), మిగిలిన 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్ల కోసం రిజర్వ్ చేయబడ్డాయి. ఈ ఐపీఓ ఒక్కో షేరు ధరను రూ.66-70గా కంపెనీ నిర్ణయించింది. దీంతో రిటైల్ పెట్టుబడిదారులు ఒక లాట్ 214 షేర్లకు తీసుకోవచ్చు. గరిష్టంగా 13 లాట్‌లను సబ్‌స్క్రయిబ్ చేయవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో రిటైల్ ఇన్వెస్టర్లు కనిష్టంగా రూ.14,980, గరిష్టంగా రూ.1,94,740 వరకు పెట్టుబడి పెట్టవచ్చు.ఏ రోజున లిస్ట్..బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్ల కేటాయింపు సెప్టెంబర్ 12, 2024న ఖరారు అయ్యే అవకాశం ఉంది. ప్రాథమిక మార్కెట్లో బజాజ్ గ్రూప్ కంపెనీ షేర్ల లిస్టింగ్ సెప్టెంబర్ 16, 2024న జరిగే ఛాన్స్ ఉంది. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ మాతృ సంస్థ బజాజ్ ఫైనాన్స్. ఈ సంస్థ 2008 సంవత్సరంలో స్థాపించబడింది. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ సెప్టెంబర్ 2015లో నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌లో నమోదు చేయబడింది. ఇది రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాపర్టీలను కొనుగోలు చేయడానికి, పునరుద్ధరించడానికి రుణాలను అందిస్తుంది.
యాంకర్ ఇన్వెస్టర్లు..బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ శుక్రవారం సెప్టెంబర్ 6న యాంకర్ ఇన్వెస్టర్ల కోసం ప్రారంభించబడింది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ రూ.1,758 కోట్లు సమీకరించింది.
యాంకర్ ఇన్వెస్టర్లకు మొత్తం 251,142,856 ఈక్విటీ షేర్లను కేటాయించినట్లు కంపెనీ తెలిపింది.



# సునీతా విలియమ్స్ లేకుండానే.. భూమిని చేరిన బోయింగ్ స్టార్‌లైనర్



**మెక్సికో-నవభూమి:** బోయింగ్ చేపట్టిన తొలి అంతరిక్ష మానవసహిత ప్రయోగం అర్ధంతరంగా ముగిసింది. వ్యోమగాములను తీసుకుని అంతరిక్షంలోకి వెళ్లిన బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక.. వారిని అక్కడే వదిలేసి కిందికి వచ్చేసింది. అమెరికా కాలమానం ప్రకారం శనివారం తెలవారుజామున 12.01 గంటలకు న్యూ మెక్సికోలోని వైట్ స్యాండ్స్ స్పేస్ హార్బర్‌కు ఖాళీ క్యాప్సుల్ భూమిని చేరింది. వ్యోమగాములు లేకుండానే ఆటోపైలట్ పద్ధతిలో నాసా దానిని తిరిగి భూమి మీదకు తీసుకువచ్చింది.బోయింగ్ క్రూ ఫ్లైట్ టెస్టులో భాగంగా నాసా ఈ ఏడాది జూన్‌లో ప్రయోగం చేపట్టింది. 10 రోజుల మిషన్‌లో భాగంగా భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్ జూన్ 5న స్టార్‌లైనర్ వ్యోమనౌకలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయల్దేరారు. వారు వెళ్లేటప్పుడే వ్యోమనౌకలో హీలియం లీక్ కావడంతో ప్రొపల్షన్ వ్యవస్థలో లోపాలు, వాల్వ్‌లో సమస్యలు వచ్చాయి. ఎలాగోలా జూన్ 6న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి సురక్షితంగా చేరుకున్నారు. జూన్ 14న వీరిద్దరూ భూమికి తిరిగి రావాల్సి ఉన్నది. అయితే వ్యోమనౌకలో సాంకేతిక సమస్యను సరిచేసే క్రమంలో వ్యోమగాముల తిరుగు ప్రయాణం ఆలస్యమవుతూ వస్తున్నది.

## కమలా హారిస్‌కు విరాళాల వెల్లువ.. ఆగస్టులో ట్రంప్ కంటే రెట్టింపు



**న్యూఢిల్లీ- నవభూమి:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్స్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ కొనసాగుతోంది. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఆమెకు భారీ స్థాయిలో మద్దతు వస్తున్నట్లు తెలుస్తోంది. ఆగస్టులో ట్రంప్‌కు వచ్చిన విరాళాల కంటే హారిస్‌కు రెట్టింపు రావడం గమనార్హం.

డెమోక్రాట్ తరఫున అభ్యర్థిత్వం ఖరారైన తర్వాత కమలా హారిస్ పూర్తిస్థాయి ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఆగస్టులో 30 లక్షల మంది దాతల నుంచి 36.1 కోట్ల డాలర్ల విరాళాలను సేకరించారు. సెప్టెంబర్‌లో న్యూయార్క్, అట్లాంటా, లాస్ ఏంజిల్స్, శాన్ ఫ్రాన్సిస్కోలలో పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు హారిస్ బృందం ఏర్పాట్లు చేస్తోంది. ట్రంప్ మాత్రం ఆగస్టులో 13 కోట్ల డాలర్లను మాత్రమే సేకరించినట్లు ఆయన బృందం వెల్లడించింది.నవంబర్‌లో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీలు ముమ్మర ప్రచారం చేస్తున్నాయి. ఇందుకోసం మొత్తంగా 1 బిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ప్రకటనలు, ఆయా రాష్ట్రాల్లో ప్రచారానికయ్యే ఖర్చుల కోసం నిధులను సేకరిస్తున్నాయి.

## అభయ హత్య మిస్టరీ వీడిందా.. రేపు సుప్రీంకు సీబీఐ నివేదిక





**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతాలోని ఆర్ జీ కర్ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ అభయ హత్యాచారం కేసు దర్యాప్తునకు సంబంధించి సీబీఐ సోమవారం సుప్రీం కోర్టుకు నివేదిక సమర్పించనుంది. ఇప్పటికీ ఆర్ జీ కర్ వైద్య కళాశాలలో జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసు దర్యాప్తు క్లిష్టంగా మారుతోంది. ఆగస్టు 9వ తేదీన మెడికల్ కాలేజీ సెమినార్ హాల్‌లో జూనియర్ డాక్టర్ మృతదేహం లభించింది. హత్యాచారం ఆరోపణలపై కోల్‌కతా పోలీసులు సంజయ్ రాయ్‌ను అరెస్ట్ చేశారు. తొలుత సంజయ్ రాయ్ కోల్‌కతా పోలీసుల వద్ద నేరాన్ని అంగీకరించాడు. కానీ తాను సెమినార్ హాల్‌కు చేరుకున్నప్పటికే జూనియర్ డాక్టర్ చనిపోయినట్లు తెలిపాడు. దీంతో అభయ హత్యపై పలు అనుమానాలు రేకెత్తాయి. ఈ క్రమంలో జూనియర్ డాక్టర్‌ని ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని సెమినార్ హాల్‌లో ఉంచారా అనే కోణంలో సీబీఐ దర్యాప్తు చేస్తోంది. కోల్‌కతా రేప్ కేసుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరగనుంది. ఈ కేసు దర్యాప్తు నివేదికను సీబీఐ కోర్టులో సమర్పించనుంది.ఆర్ జీ కర్ వైద్య కళాశాల సెమినార్ హాల్‌లోనే అభయను హత్య చేశారా.. లేదంటే మెడికల్ కాలేజీలోని మరేదైనా గది లేదా ఫ్లోర్‌లో హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని సెమినార్ హాలుకు తీసుకువచ్చారా అనే కోణంలో సీబీఐ దర్యాప్తు చేసినట్లు తెలుస్తోంది. ఆర్ జీ కర్ మెడికల్ కాలేజ్, హాస్పటల్‌లోని కొన్ని ఫ్లోర్లపై సీబీఐ నిఘా పెట్టింది. ఎనిమిదో అంతస్థులోని స్పెషల్ సర్జరీ విభాగానికి చెందిన ఆపరేషన్ థియేటర్‌పై సీబీఐ స్పెషల్ ఫోకస్ పెట్టింది. అభయ హత్యకు, ఆర్థోపెడిక్ విభాగానికి ఉన్న లింకులపై సీబీఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్థోపెడిక్ విభాగం, చెస్ట్ మెడిసిన్ విభాగాలకు చెందిన ఫ్లోర్ మ్యాప్‌ల ఆధారంగా సీబీఐ అధికారులు విచారణ చేపట్టారు.సెమినార్ హాల్‌లోని ఫోటోగ్రాఫ్‌లలో మృతుడి మృతదేహం, బూట్లు వంటి అనేక అంశాలు కనిపిస్తుండటంతో.. ఘటనా స్థలం సెమినార్ గదినా లేదా సంఘటన జరిగిన తర్వాత మృతదేహాన్ని ఆ గదికి తీసుకెళ్లారా అని నిర్ధారించడానికి సిబిఐ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ల్యాప్‌టాప్, తల, చేతులు, బెడ్ షీట్ మొదలైనవి అక్కడ అమర్చినట్లు ఉండటంతో సీబీఐ పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అభయను ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని సెమినార్ హాల్‌లో ఉంచారా అని సీబీఐ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు పూర్తైన దర్యాప్తు నివేదికను సీబీఐ సోమవారం సుప్రీంకోర్టుకు సమర్పించనుంది. ఈ నేపథ్యంలో సీబీఐ తన నివేదికలో ఎలాంటి అంశాలను పొందుపర్చిందనేది ప్రస్తుతం ఆసక్తిగా మారింది.

## ఒక వైపు తోడేళ్లు, మరోవైపు నక్కలు.. యూపీ ప్రజలపై పెరుగుతున్న వన్యమృగాల దాడులు

**లఖ్‌నవూ-నవభూమి:** ఉత్తరప్రదేశ్ ప్రజలను వన్యమృగాలు భయపెడుతున్నాయి. ఓ వైపు తోడేళ్లు గ్రామస్థుల ప్రాణాలు తీస్తుండగా తాజాగా నక్కలూ దాడులు చేస్తున్నాయి. ఆదివారం ఒక్కరోజే నక్కల దాడిలో12 మందిపైగా గాయపడ్డారు. ఈ ఘటన పిలిబిత్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పన్సోలీ, సుస్వర్ గ్రామాల్లో ఇంటి బయట చిన్నారులు ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వచ్చిన ఓ నక్కల సమూహం పిల్లలపై విరుచుకుపడింది. విచక్షణ రహితంగా దాడి చేసింది. గమనించిన స్థానికులు పిల్లలను రక్షించేందుకు వెళ్లగా వారిపైనా అవి దాడికి దిగాయి. స్థానికులు వాటిని వెంబడించి ఓ నక్కను చంపేశారు.గాయపడిన 12 మందిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రుల పరిస్థితి నిలకడగా ఉంది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. తరచూ గ్రామాల్లోకి వన్యమృగాలు వస్తున్నాయని.. అధికారులు వాటిని బంధించి తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.జులై 17వ తేదీ నుంచి జిల్లాలో చిన్నారులపై తోడేళ్లు దాడి చేస్తున్నాయని బెహరాయిచ్ జిల్లా కలెక్టర్ మోనికా రాణి ఇటీవలే తెలిపారు. తోడేళ్ల దాడుల్లో ఇప్పటి వరకు 8 మంది మరణించారని తెలిపారు. వారిలో ఏడుగురు చిన్నారులే ఉన్నారన్నారు.మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. తోడేళ్లను పట్టుకునేందుకు పోలీసులు, అటవీ శాఖ అధికారులు, స్థానిక పంచాయతీ అధికారులు బృందంగా ఏర్పడి పని చేస్తున్నారని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో తోడేళ్ల ఆచూకీ కోసం డ్రోన్‌ల సహాయం తీసుకుంటున్నామని వెల్లడించారు. చిన్నారులపై దాడి చేస్తున్న తోడేళ్లను పట్టుకునేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని వివరించారు.

# చైనాలో మరో భయాంకర వైరస్ గుర్తింపు.. మెదడుపైనే ఎఫెక్ట్!



చైనాలో మరో కొత్త రకం వైరస్ బయటపడింది. వెట్‌ల్యాండ్ ( అని పిలవబడే అత్యంత ప్రమాదకరమైన వైరస్‌ను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మెదడు, నాడీ సంబంధిత వ్యాధులకు ఇది కారణమవుతుందని గుర్తించారు.%ఈ వెట్‌ల్యాండ్ వైరస్‌ను తొలుత 2019లో గుర్తించారు. మంగోలియాలోని చిత్తడి నేలకు చెందిన ఓ 61 ఏళ్ల వృద్ధుడు అప్పట్లో అనారోగ్యానికి గురయ్యాడు. ఐదు రోజుల పాటు జ్వరం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపించాయి. ఈ లక్షణాలు కాస్త అనుమానాస్పదంగా ఉండటంతో పరిశోధకులు అప్రమత్తమయ్యారు. సమీప ప్రాంతాల్లోని దాదాపు 14,600 జీవులను సేకరించి అధ్యయనం చేశారు. వీటిలో దాదాపు రెండు శాతం పరాన్న జీవుల్లో జన్యు పదార్థం ఉన్నట్లు గుర్తించారు.అలాగే మంగోలియా ప్రాంతంలోని 640 మంది అటవీ అధికారుల రక్త నమూనాలను సేకరించి పరిశోధకులు విశ్లేషించారు. అందులో 12 మందిలో ఈ రకమైన వైరస్ ఉన్నట్లు తేలింది. జ్వరం, మైకం, తలనొప్పి, వికారం, విరేచనాలు వంటి లక్షణాలను వారిలో గుర్తించారు. వీరిలో మెదడు, వెన్నెముక ద్రవంలో అధిక తెల్ల రక్త కణాల సంఖ్య కారణంగా ఒక రోగి కోమాలోకి వెళ్లాడు. అయితే చికిత్స తర్వాత వీరంతా కోలుకున్నారు. కానీ ఎలుకలపై ల్యాబ్‌ల్లో చేసిన ప్రయోగాల్లో ప్రాణాంతకమైన ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతుందని గుర్తించారు. ముఖ్యంగా మెదడు, నాడీ సంబంధిత అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కనుగొన్నారు. తాజాగా ఈ అధ్యయానికి సంబంధించిన నివేదికను ది న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైంది.వెట్‌ల్యాండ్ వైరస్ అనేది క్రిమియన్ కాంగో హెమరేజిక్ ఫీవర్ గ్రూప్‌నకు చెందిన వైరస్. ఇది పరాన్న జీవుల ద్వారా వ్యాపిస్తుంది. పందులు, గొర్రెలు, గుర్రాల్లోనూ ఆర్‌ఎన్‌ఏ ఇది వరకే ఉన్నట్లు గుర్తించారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద ఐఫోన్ ని చూశారా?.. భారత సంతతి యూట్యూబర్ రికార్డ్!



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఐఫోన్ ని ఎప్పుడైనా చూశారా? తాజాగా భారీ సైజులో ఓ ఐఫోన్ ఇప్పుడు నెట్టింట హల్ చల్ చేస్తోంది. అది రూపొందించింది బ్రిటన్ లోని భారత సంతతికి చెందిన టెక్ కంటెంట్ క్రియేటర్ అరుణ్ మైనీ. దీని పొడవు ఏకంగా 6.74 అడుగుల పొడవు కాగా.. ఇది ఐ ఫోన్ 15 ప్రో మ్యాక్స్ కు ప్రతిరూపంగా ఇప్పుడు గిన్నీస్ రికార్డ్స్ లోకి ఎక్కింది ప్రపంచవ్యాప్తంగా యాపి సంస్థ తయారు చేసే ఐఫోన్ లకు ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పే పనిలేదు! ఈ సంస్థ తయారు చేసే ప్రొడక్స్ ను దక్కించుకోవడం, ఎప్పటికప్పుడు అప్ డేట్ అవుతుండటం చాలా మంది లైఫ్ స్టైల్లో ఓ భాగంగా... ఈ సమయంలో అరుణ్ మైనీ అనే టెక్ కంటెంట్ క్రియేటర్ ప్రపంచంలోనే అతిపెద్ద ఐఫోన్ ప్రతిరూపాన్ని రూపొందించి గిన్నీస్ రికార్డ్ క్రియేట్ చేశాడు. వివరాల్లోకి వెళ్తే... మిస్టర్ హూస్ దబాస్ పేరిట టెక్నాలజీకి సంబంధించిన ఇన్ ఫర్మేషన్ ను అందిస్తూ యూట్యూబ్ లో పేరు సంపాదించాడు అరుణ్ మైనీ. ఈ క్రమంలోనే మాథ్యూ పెర్బ్ అనే గ్యాడెట్ స్పెషలిస్ట్ తో కలిసి ఓ భారీ ఐ ఫోన్ రూపాన్ని తయారు చేశాడు. ఐఫోన్ 15 మ్యాక్స్ ను 6.7 అంగుళాల స్క్రీన్ తో ఇస్తుండగా.. దానికి ప్రతిరూపంగా తయారుచేసిన దీన్ని 6.74 అడుగుల పొడవుతో భారీ కెమెరాలతో తీర్చిదిద్దారు! గేమింగ్ యాప్ లను కూడా ఉపయోగించుకునేలా రూపొందించిన ఈ భారీ ఐఫోన్ ప్రతిరూపాన్ని స్టాండ్స్ పై అమర్చి స్థానిక వీధుల్లోకి తీసుకెళ్లారు. దీంతో ఆశచర్యపోవడం ప్రజల వంతైంది. దీనికి సంబంధించిన దృశ్యాలు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి.

## పూజా ఖేడ్కర్‌కు కేంద్రం బిగ్ షాక్.. ఐఏఎస్ నుంచి తొలగించి



**న్యూఢిల్లీ- నవభూమి:** ఐఏఎస్ ప్రొబేషనరీ మాజీ అధికారిణి పూజా ఖేడ్కర్(కు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఆమెను ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ నుంచి తొలగించింది. ఐఏఎస్ (ప్రొబేషన్) రూల్స్, 1954 ప్రకారం ఆమెపై చర్యలు తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. తమ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని వివరించాయి.మహారాష్ట్ర రాష్ట్రం పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆమెపై పలు ఆరోపణలు వచ్చాయి. అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించి లబ్ధి పొందారని పలువురు యూపీఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు.దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ ఆమెను ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది. ఫేక్ డాక్యుమెంట్లతో పరీక్ష రాసి క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేసింది. ఆ తరువాత అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది.దీనిపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా యూపీఎస్సీ చేసిన వాదనలను పూజ ఖండించారు. తాను ఫేక్ సర్టిఫికేట్లు పెట్టలేదని చెప్పారు. యూపీఎస్సీకి తనపై అనర్హత వేటువేసే అధికారం లేదని వాదించారు. అయితే ఆమె ఆరోపణలను ఖండించిన కేంద్రం ఐఏఎస్ నుంచి తొలగించింది.

## ఎస్వతిని రాజు 16వ భార్యగా దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడి కుమార్తె



**న్యూఢిల్లీ- నవభూమి:** ఉత్తర ప్రదేశ్‌లో శుక్రవారం ఓ బస్సు, వ్యాను ఢీకొనడంతో 15 మంది మరణించగా, 16 మంది గాయపడ్డారు. గాయపడినవారిని ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు అధికారులు చెప్పారు. ఆగ్రా-అలీగఢ్ జాతీయ రహదారిపై బస్సు ఓ వ్యానును ఢీకొట్టింది. కన్వర్‌పూర్ గ్రామం వద్ద ఈ దారుణం జరిగింది. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50,000 చొప్పున ఆర్థిక సాయాన్ని మోదీ ప్రకటించారు.

'సామూహిక రేప్ జరగలేదు'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై సామూహిక రేప్ జరిగిందని జరుగుతున్న ప్రచారాన్ని సీబీఐ తోసిపుచ్చింది. తమకు లభించిన ఆధారాలను బట్టి పోలీసులు అరెస్ట్ చేసిన సంజయ్ రాయ్‌కి మాత్రమే ఇందులో సంబంధం ఉందని శుక్రవారం సీబీఐ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేసి సోదాలు నిర్వహించింది. ఆయన హయాంలో మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు దాడి చేశారు. ఆయనకు సన్నిహితులైన ముగ్గురి నివాసాలపై కూడా ఈడీ దాడులు చేసింది.

## ఆధార్ కార్డు జారీ ఇక అంత ఈజీ కాదు



**అసోం: నవభూమి:** ఆధార్ కార్డుజారీపై అసోం ప్రభుత్వం కొత్త రూల్ విధించింది. ఇక నుంచి రాష్ట్రంలో కొత్తగా ఆధార్ కార్డు కావాలనుకునే వారు తప్పనిసరిగా తమ జాతీయ పౌర నమోదు నంబర్‌ను సమర్పించాల్సి ఉంటుంది. అక్టోబర్ 1 నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి రానున్నట్టు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ శనివారంనాడు ప్రకటించారు. జనాభా కంటే ఆధార్ కార్డు కోసం అప్లికేషన్లు ఎక్కువగా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అనుమానిత వ్యక్తులు ఇందులో ఉన్నట్టు అర్థమవుతోందని చెప్పారు. అక్రమ వలసలను అరికట్టడంలో భాగంగానే ఇక నుంచి ఆధార్ కార్డుల జారీ విషయంలో కఠినంగా వ్యవహరించాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. ఇక నుంచి అసోంలో ఆధార్ కార్డులు పొందడం అంత సులభం కాదన్నారు.

ఎన్‌ఆర్‌సీ సమయంలో బయోమెట్రిక్ లాక్ అయిన 9.55 లక్షల మందికి ఎన్‌ఆర్‌సీ అప్లికేషన్ నెంబర్ జత చేయాల్సిన అవసరం లేదని, వాళ్లకు మాత్రం ఆధార్ కార్డులు జారీ అవుతాయని సీఎం చెప్పారు. అక్రమంగా అసోంలోకి చొరబడే వారిని గుర్తించే ప్రక్రియను వేగవంతం చేశామని, గత రెండు నెలల్లో పలువురు బంగ్లాదేశీయులను పట్టుకుని ఆ దేశ అధికారులకు అప్పగించామని తెలిపారు.

# హైడ్రా దూకుడు.. వైసీపీ నేతలకు ఝలక్




**హైదరాబాద్-నవభూమి:** అక్రమ నిర్మాణాల తొలగింపే లక్ష్యంగా.. చెరువులు, కుంటలను కాపాడడమే ధ్యేయంగా హైడ్రా ముందుకు సాగుతోంది. ఇందుకోసం దూకుడుగా వ్యవహరిస్తోంది. భారీ కట్టడాలను.. బడా బాబులను సైతం ఎక్కడా వదిలిపెట్టడం లేదు. ఇందుకు సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను నేటమట్టం చేయడమే కాకుండా.. మరో నటుడు మురళీమోహన్‌కు నోటీసులు జారీ చేయడం ఉదాహరణకు చెప్పొచ్చు. అంతేకాదు.. భారీ విల్లాలను సైతం హైడ్రా కూల్చుతూ వస్తోంది. . మన పార్టీ అనే తేడా లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చారు. దాంతో సొంత పార్టీ కాంగ్రెస్ నేతలను సైతం హైడ్రా వదిలిపెట్టలేదు. అంతెందుకు సీఎం సొంత అన్న ఇంటికి కూడా నోటీసులు జారీ చేశారు. దీంతో హైడ్రాపై ప్రజల్లోనూ పాజిటివ్ టాక్ వినిపిస్తోంది. కట్ చేస్తే.. తాజాగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసానికి హైడ్రా ఝలక్ ఇచ్చింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. అక్రమంగా నిర్మించిన కాటసాని రాంభూపాల్ రెడ్డికి సంబంధించిన నిర్మాణాలనూ తొలగి జస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. గత నాలుగైదు రోజులుగా సైలెంట్‌గా ఉన్న హైడ్రా ఒక్కసారిగా ఫీల్డ్‌లోకి దిగడంతో ఇప్పుడు అక్రమార్కుల్లో మరోసారి భయం కనిపిస్తోంది. మరోవైపు.. అక్రమాలకు పాల్పడిన పార్టీల నేతల్లోనూ ఆ భయం కనిపిస్తోంది. తాజాగా సినీనటుడు, వైసీపీ నేతను కూడా హైడ్రా వదిలిపెట్టకపోవడంతో.. తరువాత ఎవరికి నోటీసులు వస్తాయా..? ఎవరి కట్టడాలు నేలమట్టం అవుతాయా..? అని టెన్షన్‌తో ఉన్నారు.

## ఐఎండీ అలర్ట్.. రాజస్థాన్ సహా 28 రాష్ట్రాల్లో వర్షాలు కురిసే ఛాన్స్

**న్యూఢిల్లీ- నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీతోపాటు పలు రాష్ట్రాల్లో రుతుపవనాలు మళ్లీ జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రేపు అంటే ఆదివారం కూడా 28 రాష్ట్రాల్లో వర్షం కురిసే ఛాన్స్ ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఐఎండీ ప్రకారం ఆదివారం దేశ రాజధానిలో వర్షం కురిసే అవకాశం ఉంది. ఢిల్లీకి ఆనుకుని ఉన్న నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్‌తో సహా ఎన్‌సీఆర్‌లోని కొన్ని చోట్ల వర్షం పడవచ్చు.రుతుపవనాలు మరోసారి బలపడటంతో రాజస్థాన్ రాజధాని జైపూర్ సహా పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో రాగల 24 గంటల్లో తూర్పు రాజస్థాన్‌లో చాలా చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉంది. పశ్చిమ రాజస్థాన్‌లో కొన్ని చోట్ల ఉరుములతో కూడిన వాన పడే ఛాన్స్ ఉంది. తూర్పు రాజస్థాన్‌లోని చాలా ప్రాంతాల్లో రానున్న 2-3 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

సెప్టెంబర్ 8న ఉదయపూర్, అజ్మీర్, జైపూర్ డివిజన్‌లలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అదేవిధంగా సెప్టెంబర్ 8-9 తేదీలలో కోట, అజ్మీర్, జైపూర్ డివిజన్‌లలోని కొన్ని ప్రాంతాల్లో వానలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది.

# మరోసారి గొప్ప మనసు చాటిన సోనూసూద్..



**న్యూఢిల్లీ- నవభూమి:** సోనూసూద్.. ఆయన రీల్ లైఫ్‌లోనే కాదు రియల్ లైఫ్‌లోనే హీరో. ప్రజలకు ఆపద వచ్చిందంటే చాలు క్షణం కూడా ఆలోచించకుండా తనవంతు సాయం అందిస్తారు. ఆపదలో ఆపద్బాంధవుడు అవుతాడు. అక్కడ ఇక్కడ అని కాదు.. ఏ రాష్ట్రానికి కష్టాలు వచ్చినా.. అక్కడ వాలిపోతారు. కరోనా సమయంలో ఆయన చేసిన సేవలను అందరం చూశాం. దేశవ్యాప్తంగా కరోనా కంగారు పెట్టిస్తుంటే.. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. సోనూసూద్ మాత్రం తన సేవా కార్యక్రమాలతో లక్షలాది మంది ప్రజలకు అండగా నిలిచారు. కొందరికి వ్యాపారాలు పెట్టించారు. మరికొందరికి ఆర్థిక సహాయం అందించారు. ఇంకొందరికి ప్రాణాలు పోశారు. అంతేకాదు.. తన ట్రస్ట్ ద్వారా చాలా మందికి హెల్ప్ చేశారు. కరోనా సమయంలో ఆయన రియల్ ఫైటర్ అనిపించుకున్నారు. ఎంతో మందికి సెకండ్ లైఫ్ ఇచ్చారు. వారం క్రితం తెలుగు రాష్ట్రాలు వరదలో చిక్కుకుపోయాయి. ఏపీలో విజయవాడ, తెలంగాణ ఖమ్మం, వరంగల్ జిల్లాలు వరద బారిన పడ్డాయి. ప్రజలు సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. కట్టుబట్టలతో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఇళ్లలోకి వెళ్లే పరిస్థితి లేక.. పంటలు చెడిపోయి ఇప్పుడు అంధకారంలో బతుకుతున్నారు. వర్షం సృష్టించిన బీభత్సానికి వందలాది కుటుంబాలు ఆగం అయ్యాయి. ఏ ఆపద వచ్చినా స్పందించే సోనూసూద్.. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల ప్రజల ఇబ్బందులపై చలించారు. రెండు రాష్ట్రాలకు కలిపి రూ.5 కోట్ల భారీ విరాళం ప్రకటించారు. ఏపీకి రూ.2.5 కోట్ల, తెలంగాణకు రూ.2.5 కోట్లు ఇచ్చారు. ఇప్పటికే వరద బాధితులు సాయం కోసం తమను సంప్రదించాలని సూచించారు.ను సంప్రదించాలని కోరారు. మరోసారి గొప్పమనసు చాటిన సోనూసూద్‌ను యావత్ తెలుగు రాష్ట్రాల ప్రజలు అభినందిస్తున్నారు. ఆయన సేవలను కొనయాడుతున్నారు.

## మోదీకి నా భర్త ఎప్పటికీ తలవంచరు: సునీత కేజ్రీవాల్

**భివాని-నవభూమి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందు అరవింద్ కేజ్రీవాల్ ఎప్పటికీ తలవంచరని ఆయన భార్య సునితా కేజ్రీవాల్ అన్నారు. బీజేపీ రాజకీయ ప్రతీకారానికి పాల్పడుతోంది విమర్శించారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా భివానీలోని టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సునితా కేజ్రీవాల్ శనివారంనాడు పాల్గొని ప్రసంగించారు. హర్యానా కోడలుగా తనను తాను అభివర్ణించుకున్నారు. బీజేపీ కేవలం అధికారదాహంతో ప్రత్యర్థులను జైలులోకి నెడుతోందని, పార్టీలను చీల్చడం ఎలాగో వారికి బాగా తెలుసునని విమర్శలు గుప్పించారు.'మీ ఇంటికి 24 గంటలూ విద్యుత్ అందుతోందా? ఉచితంగానే లభిస్తోందా? అలాంటిదేమీ లేదు. ప్రతి ఏరియాలోనూ విద్యుత్, గ్యాస్, నీటి కొరత కనిపిస్తోంది. ఢిల్లీ, పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం చేసిన కృషి వల్లే అక్కడ నిరంతరాయ, ఉచిత విద్యుత్ సాధ్యమైంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఆప్ అధికారంలో ఉంది. అద్భుతమైన ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పిల్లలకు చక్కటి భవిష్యత్ ఉంది. ప్రభుత్వ ఆసుపత్రులు చక్కగా పనిచేస్తున్నాయి.

నవచిత్ర



# తమ్ముడి కోసం అక్క పోరాటం.. అలియా భట్ 'జిగ్రా' ట్రైలర్ రిలీజ్




రాఖీ కట్టి తన అక్కకు ఏ కష్టం వచ్చిన చూసుకుంటాను అంటారు సోదరులు. కానీ ఇక్కడ తన తమ్ముడికి కష్టం వస్తే.. అతనికి ఎలాంటి హానీ జరగకుండా కాపాడుకుంటానని అలియా భట్ ఒక అక్కగా ప్రమాణం చేస్తుంది. రాకీ ఔర్ రాణి కియా ప్రేమ్ కహానీ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అలియా భట్ నటిస్తున్న తాజా చిత్రం 'జిగ్రా'( 'ఆర్చీస్' చిత్రంలో కీలక పాత్ర పోషించినవేదాంగ్ రైనా అలియా భట్ తమ్ముడిగా నటిస్తుండగా.. టాలీవుడ్ నటుడు రాహుల్ రవీంద్రన్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.ఈ సినిమాకు మౌనిక ఓ మై డార్లింగ్ సినిమా ఫేం వసన్ బాల దర్శకత్వం వహిస్తుండగా.. ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కరణ్ జోహార్, అపూర్వ మెహతా, అలియా భట్, షాహీన్ భట్ సోమెన్ మిశ్రా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీని దసరా కానుకగా అక్టోబర్ 11న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ చూస్తే.. ఆపదలో ఉన్నతమ్ముడిని రక్షించుకోవడానికి ఒక అక్క చేసే పోరాటమే ఈ సినిమా అని తెలుస్తుంది. ఇక అలియా భట్ చాలా రోజుల తర్వాత కొత్త లుక్‌లో కనిపించింది.

# పూజా హెగ్డే.. తగ్గక తప్పట్లేదు..



పూజా హెగ్డే.. సౌత్ ఇండియాలో మొన్నటి వరకు ఒక రేంజ్ లో బిగ్ ప్రాజెక్టులను సొంతం చేసుకుంటూ వెళ్ళింది. కానీ అమ్మడి బ్యాడ్ లక్ ఏమిటో గాని చేసిన పెద్ద సినిమాలన్నీ దెబ్బ కొట్టాయి. కెరీర్ మొదటి నుంచి కూడా పూజ పాపతో లక్కు దోబూచులాడుతోంది. 2012లో మూగమూడి అనే తమిళ్ సినిమాతో పూజా హెగ్డే హీరోయిన్ గా కెరియర్ ప్రారంభించింది. ఆ సినిమా వచ్చిన రెండేళ్ల తర్వాత తెలుగులోకి ఒక లైలా కోసం సినిమాతో అడుగుపెట్టింది. ఈ చిత్రంలో నాగ చైతన్యకి జోడీగా పూజా హెగ్డే నటించింది. నెక్స్ట్ ముకుంద సినిమాలో వరుణ్ తేజ్ తో జతకట్టింది. పూజా హెగ్డే మొదటి మూడు సినిమాలు సౌత్ లో పెద్దగా సక్సెస్ కాలేదు. హిందీలోకి మోహింజదారో సినిమాతో హీరోయిన్ గా అడుగుపెట్టింది. ఆ సినిమాలో హృతిక్ రోషన్ కి జోడీగా పూజా హెగ్డే నటించింది. ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది.మరల దువ్వాడ జగన్నాథమ్ సినిమాతో టాలీవుడ్ లోకి వచ్చిన పూజా మొదటి కమర్షియల్ హిట్ అందుకుంది. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా జెట్ స్పీడ్ తో పూజా హెగ్డే కెరియర్ కొనసాగింది. 2022లో పూజా హెగ్డే నటించిన నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. వీటిలో ప్రభాస్ రాధేశ్యామ్ కూడా ఉండటం విశేషం.అయితే ఈ నాలుగు సినిమాలలో మూడు డిజాస్టర్ అయ్యాయి. బీస్ట్ మూవీ మాత్రం యావరేజ్ టాక్ తెచ్చుకుంది. 2023లో బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్ కి జోడీగా నటించిన కిసీకా భాయ్ కిసీకి జాన్ మూవీ రిలీజ్ అయ్యి డిజాస్టర్ అయ్యింది. అదే సమయంలో గుంటూరు కారంతో పాటు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలలో ఛాన్స్ లని పోగొట్టుకుంది.ప్రస్తుతం ఆమె కెరియర్ చెప్పుకోదగ్గ స్పీడ్ లో లేదు. తమిళంలో సూర్యకి జోడీగా కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలో నటిస్తోంది. చేతిలో సినిమాలు లేకపోవడం, ఆశించిన స్థాయిలో సక్సెస్ లు రాకపోవడంతో పూజా హెగ్డే రెమ్యునరేషన్ తగ్గించేసిందంట. గత ఏడాది వరకు కోటి రూపాయిలకి పైగానే రెమ్యునరేషన్ తీసుకున్న పూజా హెగ్డే ఇప్పుడు కోటి కంటే చాలా తక్కువగానే తీసుకుంటుందంట. హిందీలో షాహిద్ కపూర్ కి జోడీగా దేవ్ అనే సినిమాని పూజా హెగ్డే కంప్లీట్ చేసింది.ప్రస్తుతం ఆమె హోప్స్ అన్ని కూడా దేవ్ చిత్రం మీదనే ఉన్నాయి. తెలుగులో ఒక స్టార్ హీరో సినిమా కోసం పూజా హెగ్డేని ప్రముఖ నిర్మాణ సంస్థ సంప్రదించినట్లు టాక్ వినిపిస్తోంది. త్వరలో ఈ సినిమాలో ఈ క్లారిటీ వస్తుందంట. సరైన కమర్షియల్ బ్రేక పడితే మరల కెరియర్ స్పీడ్ అప్ అవుతుందని పూజా హెగ్డే భావిస్తోందంట. మరి అలాంటి బ్లాక్ బస్టర్ రావాలంటే కొంతకాలం పూజా హెగ్డే రెమ్యునరేషన్ తగ్గించి మంచి కంటెంట్ ఉన్న సినిమాలు చేయక తప్పదు.


పూజా హెగ్డే

# అప్పట్లోనే హృదయం ముక్కలైంది.. రిలేషన్‌షిప్‌పై స్పందన



మిల్కీబ్యూటీ తమన్నా( రిలేషన్‌షిప్ గురించి ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చారు. తాను కూడా కొన్ని చేదు అనుభవాలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. టీనేజ్‌లోనే తొలిసారి ప్రేమలో పడ్డానని.. కొన్ని కారణాల తో అది వర్కౌట్ కాలేదని, తన జీవితంలో రెండు బ్రేకప్స్ ఉన్నాయని వెల్లడించారు. "ఇప్పటివరకూ రెండుసార్లు నా హృదయం ముక్కలైంది. ఆ సమయంలో నాకెంతో బాధగా అనిపించింది. టీనేజ్‌లో ఉన్నప్పుడే తొలి హార్ట్‌బ్రేక్ ఎదుర్కొన్నాను. ఒక వ్యక్తి కోసం నచ్చిన జీవితాన్ని వదులుకోవడం నాకు నచ్చలేదు. జీవితంలో ఏదో సాధించాలని కొత్త విషయాల గురించి అన్వేషించాలనేది నా భావన. ఆ కారణంతోనే ఆ బంధం నిలబడలేదు. ఆ తర్వాత మరో వ్యక్తితో కొంతకాలం రిలేషన్‌లో ఉన్నా. అయితే.. అతడు నాకు సెట్ కాడనిపించింది. ప్రతి చిన్న విషయానికీ అబద్ధం చెప్పేవాళ్లంటే నాకు ఇష్టం ఉండదు. అలాంటి వ్యక్తితో బంధాన్ని కొనసాగిస్తే ప్రమాదం అని అర్థమైంది. అలా అది కూడా ముగిసిపోయింది" అని తమన్నా తెలిపారు.

ప్రస్తుతం తమన్నా విజయ్ వర్మతో ప్రేమలో ఉంది. లస్ట్ స్టోరీస్ 2 సిరీస్‌లో వీరిద్దరూ కలిసి నటించారు. అప్పుడే ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. త్వరలో ఈ జంట పెళ్లి పీటలెక్కే అవకాశం ఉంది. విజయ్ తనకు పర్ఫెక్ట్ మ్యాచ్ అని తమన్నా విశ్వసిస్తున్నారు. ప్రస్తుతం ఆమె దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ వరుస సినిమాలు చేస్తున్నారు. 'స్త్రీ 2'లో స్పెషల్ సాంగ్ చేశారు. ఆమె కీలక పాత్రలో నటిస్తున్న 'ఓదెల 2' చిత్రీకరణ దశలో ఉంది.

# ఓటీటీలోకి రాబోతున్న 'ఆయ్'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే.?



గీతా ఆర్ట్స్2 పిక్చర్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మాణంలో తెరకెక్కిన తాజా చిత్రం ఆయ్ ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు అంజి కంచిపల్లి దర్శకత్వం వహించాడు. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా.. రూ.15 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా సెప్టెంబర్ 12 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవ్వనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు కార్తీక్ (నార్నె నితిన్). కరోనా వలన లాక్ డౌన్ రావడంతో తన సోంతఊరు అయిన అమలాపురం వస్తాడు. అయితే అమలాపురంలో వర్క్ ఫ్రం హోమ్ చేసుకుంటునే తన చిన్ననాటి ఫ్రెండ్స్ అయిన హరి(అంకిత్ కోయ), సుబ్బు(రాజ్ కుమార్ కసిరెడ్డి)తో కలిసి సరదాగా గడుపుతుంటాడు. అయితే అదే ఊరిలో ఉన్న పల్లవి (నయన్ సారిక)ని చూసి ఫస్ట్ లుక్‌లోనే ఇష్టం పెంచుకుంటాడు. అయితే ఊరులో ఉండే పల్లవికి సోషల్ మీడియాలో చలాకీగా ఉండడంతో పాటు కులం పట్టింపులు ఎక్కువ. అయితే కార్తీక్ తన కులం వాడే అనుకుని లవ్ చేస్తుంది. అయితే కార్తీక్ కులం వేరని తెలిసిన పల్లవి తన తండ్రి (మైమ్ గోపి) అతడిని చంపేస్తాడని దూరం పెడుతుంది. ఈ క్రమంలో కార్తీక్ ఏం చేస్తాడు. పల్లవి, కార్తీక్‌ల ప్రేమను పల్లవి తండ్రి ఒప్పుకుంటాడా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# తండ్రైన రణవీర్ సింగ్.. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన దీపికా పదుకొణె



బాలీవుడ్ స్టార్ కపుల్స్ రణవీర్ సింగ్, దీపికా పదుకొణె తల్లిదండ్రులయ్యారు. ముంబయిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నటి దీపికా పదుకొణె ఉదయం పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. ఇక రణవీర్ సింగ్, దీపికా పదుకొణె పేరెంట్స్ అవ్వడంతో సినీ ప్రముఖులతో పాటు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.'రామ్ లీలా' అనే సినిమాలో తొలిసారి కలిసి నటించారు రణవీర్ సింగ్, దీపికా పదుకొణె. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమా సమయంలోనే వీరు ప్రేమలో పడ్డారు. ఇరు కుటుంబాల అంగీకారంతో 2018లో పెళ్లి చేసుకున్నారు. అయితే వీరిద్దరూ కలిసి రామ్ లీలా తర్వాత, బాజీరావు మస్తానీ పద్మావత్ సినిమాలో కలిసి నటించారు. ఈ సినిమాలకు కూడా సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించడం విశేషం.

# రజనీకాంత్ 'వెట్టయాన్' నుంచి ఫస్ట్ సింగిల్ 'మనసిలాయో'



ఇండియన్ సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వెట్టయాన్'( తెలుగులో వేటగాడు అని వస్తున్న ఈ సినిమాకు జై భీమ్ ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం 2024 దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల కానుంది. అయితే ఈ సినిమా నుంచి ఇప్పటివరకు ఎటువంటి అప్‌డేట్ ఇవ్వని మేకర్స్ తాజాగా ఫస్ట్ సింగిల్ అప్‌డేట్‌ను పంచుకున్నారు.

ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ 'మనసిలాయో' అనే సాంగ్‌ను సెప్టెంబర్ 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సినిమాకు జైలర్ వంటి బ్లాక్ బస్టర్ ఆల్బమ్‌ను అందించిన అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ఈ పాన్ ఇండియా సినిమా తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది.

# ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ వీడ్కోలు.. ఆఖరి మ్యాచ్ అదే..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఇంగ్లండ్ సీనియర్ ఆల్‌రౌండర్ మోయిన్ అలీ( అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 10 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు అతడు ఆదివారం రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇంగ్లండ్ టీ20 వరల్డ్ కప్ హీరో అయిన మోయిన్ అలీఇకపై ఫ్రాంచైజీ క్రికెట్‌లో మాత్రమే కనిపించనున్నాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు అలీని సెలెక్టర్లు పక్కన పెట్టేశారు. దాంతో, ఇకపై మరో అవకాశం రావడం కష్టమనుకున్న అతడు వీడ్కోలు నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.'నాకు ఇప్పుడు 37 ఏండ్లు. ఈ నెలలో జరుగబోయే ఆస్ట్రేలియా సిరీస్‌కు నేను ఎంపికవ్వలేదు. ఇంగ్లండ్ తరపున చాలా క్రికెట్ ఆడాను. ఇక తర్వాతి తరం ఆడాల్సిన సమయం వచ్చేసిందనే విషయం నాకు అర్థమైంది. అందుకు ఇదే సరైన సమయం అని భావిస్తున్నా. ఇంగ్లండ్ క్రికెటర్‌గా నా అధ్యాయం ముగిసింది' అని మోయిన్ అలీ ఓ పోస్ట్‌లో తెలిపాడు.

# 2024 ఎ పారా క్రీడాకారులకు సెల్యూట్.. 18వ స్థానంలో భారత్



**న్యూఢిల్లీ-నవభూమి:** పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారులు కొత్త చరిత్ర లిఖించారు. అసమాన పోరా టంతో పారా విశ్వ క్రీడల రికార్డులు తిరగరాశారు. ఈ క్రీడా పండుగ చరిత్రలోనే దేశానికి అత్యధిక పతకాలు అందించారు. దాంతో, భారత్ ఖాతాలో మునుపెన్నడూ లేని విధంగా 29 పతకాలు వచ్చి చేరాయి. పారిస్‌లో మన క్రీడాకారులు పారా విశ్వ క్రీడల్లో 7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్య పతకాలు కొల్లగొట్టారు. దాంతో, ఈసారి ఇండియా పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచింది.పారిస్ వెళ్లేముందు.. పారాలింపిక్స్‌లో ఈసారి 25 పతకాలు సాధిస్తాం భారత పారాలింపిక్స్ కమిటీ అని చెప్పినప్పుడు అదే మాట నిజమైతే బాగుండు అనుకున్నారంతా. అయితే.. అంతకంటే నాలుగు పతకాలు ఎక్కువే వచ్చాయి. జావెలిన్ త్రోలో నవ్‌దీప్ సింగ్ స్వర్ణంతో గర్జించాడు. దాంతో, భారత్ పతకాల సంఖ్య 29కి చేరింది.

నవక్రీడ

# దూసుకొస్తున్న జురెల్.. ధోనీ 'ఆల్‌టైమ్ రికార్డు' సమం



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత యువ క్రికెటర్ ధ్రువ్ జురెల్( వికెట్ కీపింగ్‌లో అదరగొడుతున్నాడు. ఈ ఏడాది ఆరంభంలో రాంచీ టెస్టు(లో వీరోచిత ఇన్నింగ్స్ ఆడిన జురెల్ ఏడో స్థానంలో పాతుకుపోయాడు. దాంతో, అప్పుడే ఈ యంగ్‌స్టర్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ వారసుడు అంటూ ప్రశంసలు అందుకున్నాడు. తాజాగా ఈ యువకెరటం దేశవాళీ క్రికెట్‌లో ధోనీ 'ఆల్‌టైమ్ రికార్డు'ను సమం చేశాడు.

దులీప్ ట్రోఫీలో ఏడు క్యాచ్‌లు అందుకొని క్రితం మహీ భాయ్ సరసన చేరాడు. 2002-05 సీజన్‌లో ఈస్ట్ జోన్ తరఫున ఆడిన ధోనీ ఒకే మ్యాచ్‌లో ఏడు వికెట్లతో సంచలనం సృష్టించాడు. 'ఇండియా ఏ' తరఫున ఆడుతున్న జురెల్ వికెట్ల వెనకాల అద్భుతమైన నైపుణ్యం కనబరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఒకే క్యాచ్ పట్టిన జురెల్.. రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా ఏకంగా ఆరు క్యాచ్‌లు అందుకున్నాడు.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**